వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 304 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | మే 2025 | వెల : రూ 10/-




## ఎంటర్‌టైన్ మెంట్ హబ్‌గా భారత్

- వేవ్స్ సదస్సు ప్రారంభంలో ప్రధాని మోడీ
- హాజరైన చిత్రరంగ ప్రముఖులు

ముంబయి, మే 1(ప్రజా స్వేచ్ఛ)

భారత్ ఎంటర్‌టైన్ మెంట్ హబ్‌గా మారుతుందని భారత్ ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్ ను మోడీ ప్రారంభించారు. వేవ్స్ సదస్సుకు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

సృజనాత్మక హబ్ గా తయారై కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. సంప్రదాయ, నవతరాలను -మిగతా 3 లో



# సమ్మె ఆలోచన విరమించుకోండి

### ఆర్టీసీ ఇప్పుడిప్పడే గట్టెక్కుతోంది

- సంస్థను కాపాడుకునే బాధ్యత మనదే
- గత అప్పులకు వడ్డీల కోసం అప్పులు చేస్తున్నాం
- మేడే ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 1(ప్రజా స్వేచ్ఛ)

ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండని మే డే వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది.. ఇది మీ సంస్థ.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ -మిగతా 3 లో




### బలగాల ఆత్మస్థైర్యం

## దెబ్బతీస్తారా

### పహల్గామ్ ఘటన పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ మే 1(ప్రజా స్వేచ్ఛ)

వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల ఆత్మస్థైర్యం దెబ్బతీయాలను కుంటున్నారా? మీక్కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దని ధర్మాసనం సూచించింది. జమ్మూకశ్మీర్‌లోని -మిగతా 3 లో



## ఉగ్రవాదులను వెంటాడి వేటాడి పట్టుకుంటాం

- కేంద్రమంత్రి అమిత్ షా హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 1(ప్రజా స్వేచ్ఛ)

ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టుకొని శిక్షిస్తామని వేటాడి వెంటాడి పట్టుకుంటామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఉగ్రదాడిపై తొలిసారి షా స్పందించారు. కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నామని అన్నారు. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో చోటుచేసుకున్న ఉగ్రదాడిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా -మిగతా 3 లో

# కులగణనను ఏనాడు పట్టించుకోని కాంగ్రెస్



- తెలంగాణలోనూ తూతూ మంత్రంగా సర్వే
- ఎవరో డిమాండ్ చేస్తే తీసుకున్న నిర్ణయం కాదు
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 1(ప్రజా స్వేచ్ఛ)

బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. -మిగతా 3 లో

### నేడు రాజ్‌భవన్‌కు

## కాంగ్రెస్ నేతలు

### బీసీ బిల్లు ఆమోదించినందుకు గవర్నర్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్, మే 1(ప్రజా స్వేచ్ఛ)

రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు కలవనున్నారు. ఏప్రిల్ 8వ తేదీన బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసన సభలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపడంతో -మిగతా 3 లో

### కేంద్ర ఎన్నికల సంఘం

## కీలక నిర్ణయం

### జనన, మరణ ధ్రువీకరణ రికార్డులతో ఓటర్ అనుసంధానం

న్యూఢిల్లీ, మే 1(ప్రజా స్వేచ్ఛ)

ఓటర్ల జాబితాను నవీకరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాను జనన, మరణ ధ్రువీకరణ రికార్డులతో అనుసంధానం చేయనున్నట్లు ఈసి గురువారం ప్రకటించింది. ఓటర్ల జాబితాలో పవిత్రతను నిర్ధారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. భారత రిజిస్ట్రార్ జనరల్ నుండి ఎలక్ట్రానిక్‌గా ఎప్పటికప్పుడు మరణ నమోదు డేటాను సేకరించి, ఓటర్ల జాబితాను నవీకరిస్తామని వెల్లడించింది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ -మిగతా 3 లో



## 2వేలు తగ్గిన బంగారం ధర

### అంతర్జాతీయ పరిణామాల ప్రభావం

హైదరాబాద్, మే 1(ప్రజా స్వేచ్ఛ)

బగారం ధరల పెరుగుదలతో దాదాపు 15శాతంకొనుగోళ్లు పడిపోయాయని నివేదికలు వెల్లడించిన వేళ ధరలు దిగి వచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ మార్కెట్‌లో ఆల్-టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర గత కొన్ని రోజులుగా కాస్త దిగొస్తోంది. -మిగతా 3 లో

## నేడు అమరావతి పునర్నిర్మాణ సభ

- 58 వేల కోట్ల విలువైన పనులకు మోడీ శంఖుస్థాపన
- భారీగా ఏర్పాట్లు చేసిన కూటమి ప్రభుత్వం
- మధ్యాహ్నం 12కల్లా సభ ప్రాంగణానికి బస్సుల రాక
- మరోమారు అధికారులతో సమీక్షించిన మంత్రుల బృందం



అమరావతి, మే 1(ప్రజా స్వేచ్ఛ)

ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం గురువారం జరగనుంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా ఇది ప్రాంభం కానుంది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన కేవలం గంటా 25 నిమిషాలు పాటు ఉండనుంది. ఈ సందర్భంగా 58 వేల కోట్ల విలువైన పనుల శంఖుస్థాపన ప్రారంభోత్సవ -మిగతా 3 లో

## రాహుల్ గాంధీ ముందుచూపున్న నేత

- కులగణన డిమాండ్‌తో రాహల్ సత్తా తేలింది
- మోడీకి ఈ ఐడియా ముందే ఎందుకు రాలే
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్, మే 1(ప్రజా స్వేచ్ఛ)

రాహుల్ గాంధీ జోడో యాత్రలో దేశ ప్రజల సమస్యలకు పరిష్కారం చేసే దిశగా అడుగులు వేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. భారత్ జోడో యాత్రలో ప్రధాన అంశం కుల గణన.. కుల గణన చేయాలని రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు.. ఇప్పుడున్న కేంద్రం -మిగతా 3 లో


# శంషాబాద్‌లో మూడున్నర కిలోల బంగారం పట్టివేత



హైదరాబాద్, మే 1(ప్రజా స్వేచ్ఛ

శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టివేసారు. మస్కట్ నుంచి వచ్చిన విమాన సిబ్బంది వద్ద బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మస్కట్ నుంచి బంగారం తెచ్చి గ్రౌండ్ స్టాప్ కు ప్యాసింజర్లు అందించారు. ఎయిర్ పోర్ట్ నుంచి బంగారాన్ని బయటికి తీసుకొచ్చేందుకు గ్రౌండ్ స్టాప్ ప్రయత్నించగా.. 3.5 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. బంగారం స్మగ్లర్ కి సహకరించిన గ్రౌండ్ స్టాప్ ని డీఆర్ఐ అధికారులు పట్టు-కున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి పార్కింగ్ వరకు బంగారం తీసుకొచ్చి అప్పగిస్తుండగా పట్టుకుని.. 3.5 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. పట్టుబడ్డ బంగారం విలువ దాదాపు 3 కోట్ల 45 లక్షల రూపాయలు ఉంటుందని అంచానా వేశారు.


# అట్టారి-వాఘా బోర్డర్ పూర్తిగా మూసివేత




న్యూఢిల్లీ: ప్రజా స్వేచ్ఛ

భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న అట్టారి-వాఘా బోర్డర్ ను గురువారం పూర్తిగా మూసివేశారు. గడిచిన వారం రోజులు బోర్డర్ రూట్లో జనం రెండు దేశాలకు ప్రయాణించారు. షార్ట్ టర్మ్ వీసాలున్న పాకిస్తానీయులు దేశం విడిచి వెళ్లాలని పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో కేంద్ర సర్కారు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి అట్టారి-వాఘా బోర్డర్ క్రాసింగ్ పాయింట్‌ను పూర్తిగా క్లోజ్ చేశారు. గురువారం రోజున ఒక్కరు కూడా వాఘా బోర్డర్ దాటినట్లు ఆనవాళ్లు లేవు.బుధవారం రోజున 125 మంది పాకిస్థానీలు ఇండియా దాటి వెళ్లారు. దీంతో గత ఏడు రోజుల్లో దేశం విడిచి వెళ్లిన పాకిస్తానీయుల సంఖ్య 811కు చేరుకున్నది. పాకిస్థాన్ వీసాలు ఉన్న 15 మంది భారతీయ పౌరులు కూడా పాకిస్థాన్‌లోకి ప్రవేశించారు. దీంతో ఆ సంఖ్య 23కు చేరుకున్నది. ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో దాడి జరిగిన తర్వాత పాకిస్తానీయులు దేశం విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇండియాను వీడి వెళ్లే సార్క్ వీసాదారులకు ఏప్రిల్ 26, మెడికల్ వీసాదారులకు ఏప్రిల్ 29 వరకు డెడ్‌లైన్ విధించారు. మరో ఇతర 12 కేటగిరీల వీసాలు కలిగి ఉన్న ప్రజలకు డెడ్‌లైన్‌ను ఏప్రిల్ 27 వరకు పెట్టారు.

# భర్త ముందే మహిళా డ్యాన్సర్‌పై సామూహిక అత్యాచారం



పాట్నా మే 1(ప్రజా స్వేచ్ఛ

మహిళా డ్యాన్సర్‌పై ఆమె భర్త ముందే సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు స్పందించారు. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మరో నిందితుడి కోసం పోలీసులు వెతుకున్నారు. బీహార్‌లోని వైశాలి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆర్కెస్ట్రా డ్యాన్సర్ అయిన మహిళ తన భర్తతో కలిసి శంకర్‌పూర్ దియారాకు వెళ్లింది. ఏప్రిల్ 29న రాత్రి వేళ అక్కడ జరిగిన పెళ్లి వేడుకలో డ్యాన్స్ ప్రదర్శన ఇచ్చింది.కాగా, డ్యాన్స్ ప్రోగ్రామ్ తర్వాత అర్ధరాత్రి వేళ తన భర్తతో కలిసి ఆ మహిళ తిరుగు ప్రయాణమైంది. రైల్వే స్టేషన్‌కు ఎలా వెళ్లాలో తెలియకపోవడంతో రాత్రి వేళ ఒక చోట ఉన్న ముగ్గురు వ్యక్తులను దారి గురించి అడిగారు. అయితే రైల్వే స్టేషన్ వద్ద దింపుతామన్న నెపంతో తమ బైకులపై వారిని ఎక్కించుకున్నారు. సమీప పొలంలోకి తీసుకెళ్లారు. భర్తను నిర్బంధించి అతడి ఎదుటే ఆ డ్యాన్సర్‌పై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. మరోవైపు బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మనీష్ కుమార్, మనోజ్ కుమార్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. పరారీలో ఉన్న మూడో నిందితుడి కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. బాధితురాలికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు.

# తెలుగు చిత్రసీమ ఊపిరి పీల్చుకుంది

### -హిట్-3 టీమ్‌ను అభినందించిన దిల్‌రాజ్



హైదరాబాద్,మే 1(ప్రజా స్వేచ్ఛ

'హిట్ 3'తతో తెలుగు చిత్రపరిశ్రమ మళ్లీ ఊపిరి పీల్చుకుందని నిర్మాత దిల్ రాజు (ఉశిష) అన్నారు. ఈ సినిమా విజయంలో భాగంగా చిత్రబృందం తాజాగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన పాల్గొన్నారు. టీమ్‌ను అభినందించారు. ఇది మరెంతగానో విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. తెలుగు చిత్రపరిశ్రమ ఈరోజు మళ్లీ ఊపిరి పీల్చుకుంది. గత నెలలో ఎన్నో చిత్రాలు విడుదలయ్యాయి. కానీ, ప్రేక్షకులు మాత్రం థియేటర్లకు అంతగా రాలేదు. సరైన చిత్రాలు లేక రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలాచోట్ల గత నెలలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూత పడ్డాయి. అలాంటి సమయంలో చిత్ర పరిశ్రమ మొత్తం 'హిట్ 3'పై నమ్మకం పెట్టు-కుంది. మూడు రోజుల క్రితం ఆన్‌లైన్ బుకింగ్స్ చూసి మేము ఎంతో ఆనందపడ్డాం. సినిమా చూసిన ప్రేక్షకులందరూ ఒకటే మాట చెబుతున్నారు. చివరి అరగంట అదిరిపోయిందంటున్నారు. కంటెంట్ కొత్తగా ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని మరోసారి నిరూపితమైంది. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కొత్త ఆలోచనలతో సినిమాలు తీసే బాధ్యత ఇకపై మాపై కూడా ఉందని దిల్ రాజు అన్నారు. తమ ప్రయాణం ఇప్పుడే మొదలైందని.. రానున్న రోజుల్లో తమ సినిమా మరెంతగానో ప్రేక్షకులకు చేరువ అవుతుందని నాని అన్నారు. తమ టీ-మ్‌ను అభినందిస్తూ చిత్రపరిశ్రమకు చెందిన వారి నుంచి ఎన్నో సందేశాలు వచ్చాయన్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా యూఎస్ వెళ్తున్నానని రాగానే సెలబ్రేషన్స్ మొదలుపెడతామని చెప్పారు. ఈ సినిమాతో తనెంటో శైలేశ్ మరోసారి నిరూపించుకున్నారని నాని చెప్పారు. హిట్' యూనివర్స్‌లో భాగంగా రూపొందిన చిత్రమే 'హిట్ 3'. ఇందులో నాని, శ్రీనిధి శెట్టి జంటగా నటించారు. అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో నాని నటన సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది.

# హెచ్చరించినా మారని పాక్ తీరు.. సరిహద్దుల్లో కొనసాగుతున్న కవ్వింపు చర్యలు

శ్రీనగర్ మే 1 ప్రజా స్వేచ్ఛ

కుక్క తోక వంకరే.. అన్న చందంగా పాకిస్థాన్ తన తీరును మార్చుకోవడం లేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడవడంపై భారత్ హెచ్చరికలు జారీచేసినా పట్టించుకోవడం లేదు. సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వెంబడి ఏకపక్షంగా కాల్పులకు తెగబడుతూనే ఉన్నది. వరుసగా ఏడో రోజూ రాత్రి పాక్ రేంజర్లు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి ఉన్న కుప్వారా, ఉరి, అఖ్నూర్ సెక్టార్‌లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ సైనికులు కాల్పులు జరిపారు. అయితే పాక్ రేంజర్ల కాల్పులను భారత ఆర్మీ సమర్థవంతంగా తిప్పికొట్టారు. ఈ మేరకు సైన్యం వెల్లడించింది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్‌పై పాక్ అప్రకటిత కాల్పులు జరుపుతున్న విషయం తెలిసిందే.కాగా, బుధవారం రాత్రి కూడా పాక్ సైన్యం కాల్పులు జరిపిందని, వీటిని భారత సైన్యం దీటుగా తిప్పికొట్టిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. జమ్ములోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి, రాజౌరీ జిల్లాలోని సుందరబానీ, నౌషార సెక్టార్లలో, కశ్మీర్‌లోని బారాముల్లా, కుప్వారాలో భారత్ సైనిక పోస్టులే లక్ష్యంగా పాక్ ఆర్మీ కాల్పులు జరిపిందని తెలిపింది. 2003 నాటి కాల్పుల



విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరిస్తూ భారత్-పాక్ మధ్య ఫిబ్రవరి 2021లో అంగీకారం కుదిరింది. అయితే దీనిని పాక్ ఏకపక్షంగా ఉల్లంఘిస్తూ, వరుసగా ఆరో రోజు రాత్రి భారత్ సైన్యంపై కాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. ఇరు దేశాలను విడదీస్తూ గుజరాత్ నుంచి జమ్ములోని అఖ్నూర్ వరకు 3,323 కిలోమీటర్ల వెంబడి భారత్ సరిహద్దును కలిగి ఉంది. ఇందులో అంతర్జాతీయ సరిహద్దు 2,400 కిలోమీటర్లుగా, 740 కిలోమీటర్లు ఎల్‌వోసీ (నియంత్రణ రేఖ)గా ఉంది. కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ తూట్లు పొడవడంపై భారత్ హెచ్చరికలు జారీచేసింది. ఇరు దేశాలకు చెందిన మిలిటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరళ్లు హాట్‌లైన్ ద్వారా మాట్లాడుకున్నారని, పాక్ కాల్పులకు తెగబడుతుండటంపై భారత్ వార్నింగ్ ఇచ్చినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు.

### పాక్ విమానాలకు భారత గగనతలం మూసివేత

పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌ను భారత్ అష్ట దిగ్బంధం చేస్తున్నది. తాజాగా పాక్‌కు చెందిన విమానాలు భారత గగనతలంలోకి రాకుండా ఆంక్షలు విధించింది. ఇప్పటికే పాక్ తన గగనతలాన్ని మూసివేసి భారత్ విమానాలకు ప్రవేశం లేకుండా అడ్డుకుంది. దీనికి ప్రతీకారంగా భారత్ కూడా పాకిస్థాన్‌కు చెందిన, దాని ఆధ్వర్యంలో నడుస్తున్న, ఆ దేశం లీజుకు తీసుకున్న వాణిజ్య విమానాలతో పాటు మిలిటరీ విమానాలకు తమ గగనతలంలో ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు అమలులో ఉంటాయని తెలిపింది. భారత్ విధించిన ఈ ఆంక్షలతో కౌలాలంపూర్ లాంటి ఆగ్నేయ ప్రాంతాలకు వెళ్లే పాకిస్థాన్ విమానాలు చైనా, శ్రీలంక లాంటి దేశాల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది

# రామ్ దేవ్ బాబాపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం




హైదరాబాద్ మే 1(ప్రజా స్వేచ్ఛ

రూఅఫ్జాపై రామ్‌దేవ్ కొత్త వీడియో విడుదల చేయడంపై ఢిల్లీ హైకోర్టు గురువారం తీవ్రంగా స్పందించింది. అవమానకరమైన వ్యాఖ్యలతో రూఅఫ్జాపై రామ్‌దేవ్ మరో కొత్త వీడియోను రూపొందించడం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. రామ్‌దేవ్ ప్రవర్తన ఆయన ఎవరి నియంత్రణలోనూ లేరని, తన సొంత ప్రపంచంలో నివసిస్తున్నారని ధృవీకరిస్తుందని జస్టిస్ అమిత్ బన్సాల్ పేర్కొన్నారు. ఆయన ఆలోచనలను తనలోనే ఉంచాలని, వాటిని వ్యక్తపరచవలసిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. హమ్‌దార్ద్ సంస్థకి చెందిన రూఅఫ్జాపై రామ్‌దేవ్ ఇకపై ఎటువంటి బహిరంగ వ్యాఖ్యలు, ప్రకటనలు లేదా వీడియోలను పోస్ట్ చేయకూడదంటూ గతంలో కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వుల దృష్ట్యా ఆయన అఫిడవిట్, వీడియో ప్రాథమికంగా కోర్టు ధిక్కారణ కిందకే వస్తాయని బన్సాల్ మండిపడ్డారు. విచారణకు హాజరుకావాల్సిందిగా రామ్‌దేవ్‌కు నోటీసులు జారీ చేశారు.

**కేసు వివరాలు :**

ఈ నెల ప్రారంభంలో పతంజలికి చెందిన గులాబ్ షర్బత్‌ను ప్రచారం చేస్తూ.. రూఅఫ్జా నుండి వచ్చే ఆదాయాన్ని మదర్సాలు, మసీదుల నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు వినియోగిస్తున్నారని రామ్‌దేవ్ ఆరోపించారు. షర్బత్ జీహాద్ అంటూ రూఅఫ్జాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించాయి. ఈ వ్యాఖ్యలపై విచారణ చేపట్టాల్సిందిగా హమ్‌దార్ద్ కోర్టును ఆశ్రయించింది. రామ్‌దేవ్ వ్యాఖ్యలు సమర్థించలేనివని, దిగ్భ్రాంతికి గురిచేశాయని ఏప్రిల్ 22న విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు కోర్టు వ్యాఖ్యానించింది.

# తహవ్వూర్ కేసులో కీలక పరిణామం..



హైదరాబాద్ మే 1(ప్రజా స్వేచ్ఛ

26/11 ముంబయి ఉగ్రదాడి నిందితుడు తహవ్వూర్ రాణా వాయిస్, చేతిరాత నమూనాలను సేకరించేందుకు ఢిల్లీ కోర్టు ఎన్ఐకి అనుమతి ఇచ్చింది. ఏప్రిల్ 28న రాణా కస్టడీని 12 రోజుల పాటు పొడిగించిన ప్రత్యేక జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) న్యాయమూర్తి చందర్‌జిత్ సింగ్, ఏజన్సీ దాఖలు చేసిన దరఖాస్తుపై ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు గురువారం ప్రకటించాయి. ఈ దాడుల ప్రధాన కుట్రదారుడు డేవిడ్ కొలెమన్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీకి సన్నిహితుడు, అమెరికా పౌరుడైన రాణాను ఏప్రిల్ 10న భారత్‌కు తీసుకువచ్చారు. 2008 నవంబర్ 26న 10మంది పాకిస్తానీ ఉగ్రవాదుల బృందం సముద్రమార్గాన్ని వినియోగించి ముంబయిలోకి చొరబడి దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 166 మంది మరణించారు

# 1300 కిలోల బంతిపూలతో కేదార్‌నాథ్ ఆలయం అలంకరణ

డెహ్రాడూన్ మే 1(ప్రజా స్వేచ్ఛ

కేదార్‌నాథ్ ఆలయం రేపు తెరుచుకోనుంది. ఈ నేపథ్యంలో ఆలయం అలంకరణ పనులు కొనసాగుతున్నాయి. భక్తులకు కనువిందు కలిగించే విధంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. 1300 కిలోల బంతిపూలతో కేదార్‌నాథ్ ఆలయాన్ని అలంకరిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీ బాబా కేదార్‌నాథ్ ధామ్ టెంపుల్ మే 2వ తేదీన ఉదయం 7 గంటలకు తెరుచుకోనుంది.పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది.

# సమ్మె ఆలోచన విరమించుకోండి

(మొదటి తరువాయి)

కార్మికులపైనే ఉంది అన్నారు. గత పదేళ్లలో విధ్వంసం జరిగింది.. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీ కొనసాగిందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండి.. ఏదైనా సమస్య ఉంటే మంత్రిగారితో చర్చించండి.. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి అన్నారు. అణాపైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. అందుకే ఒకసారి ఆలోచించండి అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన మేడే వేడుకల్లో సిఎం పాల్గొని ప్రసంగించారు. కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు- చెప్పాల్సిన బాధ్యత నాపై ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మె పోటు- రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు అని సూచించారు. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి.. నమ్ముకున్న మీకు అండగా ఉంటాను అని చెప్పుకొచ్చారు. వారానికి ఒకరోజు సెలవు.. కార్మికుల పోరాట ఫలితమే అన్నారు. ఇక, తెలంగాణలో ఆర్థిక మాంద్యం తక్కువ ఉందన్నారు. సింగరేణిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు మొదటి సారి మనమే బోనస్ ఇచ్చాం.. సింగరేణిని పదేళ్లు నిర్వీర్యం చేశారు .. కారుణ్య నియామకాలు సరళీకృతం చేశాం.. ఒక కుటుంబమే 7 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారు. కార్మికుల పట్ల ఎప్పుడైనా అనుకూలంగా మాట్లాడారా వాళ్ళు.. లక్ష రెండు వేల కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లకు ఇచ్చాడు.. కానీ కట్టిన ముడేళ్లకే కూలి పోయింది అని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అప్పులు కట్టడానికి లక్ష రెండు వేల కోట్లు అప్పు తెచ్చిన.. వడ్డీలు కట్టడానికే సరిపోతుంది.. ఏ పథకం అయినా ఆగిందా?.. అని ముఖ్యమంత్రి రేవంత్ ప్రశ్నించారు. ఇక, ఖజానా అంతా లూటీ చేసినా ఏ పథకం ఆగలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పేద ప్రజల ఇండ్లో సన్న బియ్యం ఇస్తున్నాం.. గుజరాత్ లో కూడా ఏడాదిలో 58 వేల ఉద్యోగాలు ఇచ్చారా?.. నేను ఇచ్చిన.. మనం దివాలా తీశాం.. కేసీఆర్ కుటు-ంబం మాత్రం కోట్లు- వెనకేసుకున్నారు అని ఆరోపించారు. గతంలో మీ ఫోన్ లు స్వేచ్ఛగా మాట్లాడుకున్నారా.. ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుకుంటు-న్నారు.. స్వేచ్ఛ, సంక్షేమం ఇచ్చినం మేమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఆర్టీసీ కార్మికులు పంథానికి పోకండని సూచించారు. మిమ్మల్ని ఆదుకుంటాం.. మీ సమస్యలు మంత్రితో మాట్లాడండి.. లేదంటే నా దగ్గర ఉన్న ఖజానా మీకు ఇస్తా.. మీరే చూసి చెప్పండి అన్నారు. బడ్జెట్ పద్మనాభం లాగా తయారైంది నా పరిస్థితి అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# కులగణనను ఏనాడు పట్టించుకోని కాంగ్రెస్

(మొదటి తరువాయి)

జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగ పడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు' అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోడీ నేతృత్వంలో క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.. ప్రధానికి హృదయపూర్వక ధన్యవాదాలు.. దేశంలో సానుకూలమైన మార్పుకు, కులగణన.. చరిత్రాత్మకమైన కులగణన, చరిత్ర పుటల్లో నిలిచిపోనుంది అన్నారు. ప్రతిపక్ష పార్టీలు నాటకాలకు తెరలేపుతున్నారు.. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు సంబంధించి, కుట్రలు కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. అలాగే, ముస్లింలను తీసుకెళ్లి బీసీల్లో చేర్చడం దారణం.. కాంగ్రెస్ అన్ని తప్పుడు నిర్ణయాలు చేసింది.. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్రపతుల అభ్యర్థిత్వాలను వ్యతిరేకించింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మోడీ సర్కార్ ఎన్నో ఏళ్ల పెండింగ్ అంశం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టుకు తమ వైఖరిని స్పష్టం చేశాక.. వర్గీకరణ అంశంపై కోర్టు కీలక తీర్పు ఇచ్చింది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మోడీనీ కులం పేరుతో దూషించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి బీసీల పట్ల మొసలి కన్నీరే కార్చింది.. 2018లో మోడీ ప్రధాని అయ్యాక బీసీ కమిషన్ కు రాజ్యంగ బద్దంగా చట్టం చేశారు.. అన్ని వర్గాలకు న్యాయం చేయ్యాలని.. ఆర్థికంగా వెనకబడిన వర్గాల కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది మోడీ ప్రభుత్వం అని కిషన్ రెడ్డి అన్నారు. కాగా, మహిళల సాధికారిత కోసం 35 శాతం రిజర్వేషన్లు కల్పించామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసి.. వాళ్లకు న్యాయం చేసింది మోడీ సర్కార్.. 1981 నుంచి 1931 వరకు కులగణన జరిగింది.. ఆ తర్వాత కులగణ జరక్కుండా కాంగ్రెస్ వ్యవహరించింది.. కులగణనకు కాంగ్రెస్ వ్యతిరేకం అని మండిపడ్డారు. మండలి కమిషన్ నివేదికను రాజీవ్ గాంధీ వ్యతిరేకించారు.. 2010లోనే సుష్మాస్వరాజ్ కులగణన అంశాన్ని లేవనెత్తారు.. సామాజికంగా అన్ని వర్గాలకు లబ్ధి జరగాలి అని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా.. దేశ హితం కోసమేనన్నారు. న్యాయ స్థానాలకు తీర్పుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.. మేం చేసే కులగణనలో మతం ప్రాతిపదికన ఏ మతాలను బీసీల్లో చేర్చేది లేదు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు.

# నేడు రాజ్‌భవన్‌కు కాంగ్రెస్ నేతలు

(మొదటి తరువాయి)

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి కాంగ్రెస్ బీసీ నేతలు ధన్యవాదాలు తెలపనున్నారు. ఉదయం రాజ్ భవన్ తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు- మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, కేశవరావు ,మధుయాష్కి గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, దండే విఠల్, విజయశాంతి, నారాయణ, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వాకటి శ్రీహరి, మక్కన సింగ్ రాజ్ ఠాకూర్, ఈర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇతర ముఖ్య నేతలు ఉన్నారు.

# రాహుల్ గాంధీ ముందుచూపున్న నేత

(మొదటి తరువాయి)

కుల గణన చేస్తామని ప్రకటన చేయడం స్వాగతిస్తున్నాం.. రాహుల్ గాంధీ ముందు చూపుతో ఉన్నాడు అనడానికి కుల గణన ఒకటి.. దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ హీరో.. రాష్ట్రంలో కుల గణన చేసినందుకు రేవంత్ రెడ్డి హీరో అని కొనియాడారు. ఇప్పుడు బీజేపీ వాళ్లు సంకలు గుద్దుకున్న లాభం లేదు.. రాహుల్ గాంధీకి ఎంత ముందు చూపు ఉందో అర్థం అవుతుంది.. మోడీ చేయకపోతే.. రాహుల్ గాంధీ ప్రధాని కాగానే ఆయనే చేసే వాడు అని జగ్గారెడ్డి తెలిపారు. అయితే, రాష్ట్రంలో కుల గణన లెక్కలోకి రాని వారు.. కేంద్ర కులగణనలో లెక్కకు వస్తారు అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. రెండేళ్ల క్రితమే మోడీ చెప్తే బాగుండేది అనుకుంటున్నారు.. రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని బీజేపీ నేతలకు మింగుడు పడటం లేదు.. రాహుల్ గాంధీ అనే వరకు మోడీ ఎందుకు ఎదురు చూశాడని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి వచ్చిన ఐడియా మోడీకి ఎందుకు రాలేదంటూ సెటైర్లు వేశాడు. బీజేపీ వాళ్ళ లెక్క పదవుల కోసం ఎదురు చూసే రకం కాదు రాహుల్ కుటుంబం.. వాళ్ళే ప్రధాన మంత్రులను చేస్తారు.. కొందరికి భయం ఉంటది.. రేవంత్ కుల గణన చేసి మార్కులు కొట్టి పడేశాడన్నారు. రేవంత్ కూడా అదృష్టవంతుడు.. రాహుల్ గాంధీ లైన్ లో వెళ్లి జాక్ పాట్ కొట్టేశాడు అని టీ-పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఇక, కిషన్ రెడ్డి ఇప్పుడు ఏం అన్నా లాభం లేదు అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. సుష్మ స్వరాజ్ 2010లో అంటే.. ఇప్పటి వరకు ఎందుకు చేయలేదు మీరు.. మీరేం చెప్పినా కుల గణన హీరో రాహుల్ గాంధీ.. కుల గణనలో ఇతర మతాల వారు ఉండరని కిషన్ రెడ్డి కాదు మోడీ చెప్పాలన్నారు. కిషన్ రెడ్డికి ఇష్టం లేదు కదా అని వదిలేస్తారా..?.. ప్రధాని ఏం చెప్తారో చూసి మాట్లాడదాం.. ముస్లింలు భారత దేశ పౌరులు కదా..? అని ప్రశ్నించారు. దేశంలో పుట్టిన హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు అంతా భారత దేశ బిడ్డలే కదా అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# నేడు అమరావతి పునర్నిర్మాణ సభ

(మొదటి తరువాయి)

కార్యక్రమాలు ప్రధాని మోడీ చేతుల మీద జరగనున్నాయి. రాజధాని అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని రానున్న తరుణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవాడ కలెక్టరేట్లో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. మోడీ అమరావతి పర్యటనను విజయవంతం చేయాలని బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులకు మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి దిశానిర్దేశర చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్ లో మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర సమీక్ష నిర్వహించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రధానంగా ట్రాఫిక్ రోడ్లు, వర్షం వస్తే వచ్చే ఇబ్బందులపై దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు ఇచ్చారు. అమరావతి పునఃనిర్మాణ పనులు పెద్ద ఎత్తున ప్రారంభం కానున్న వేళ రాజధానికి తరలివచ్చే వారి కోసం ప్రభుత్వం రవాణా వసతిని కల్పిస్తోంది. ఇందుకోసం ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు, ఆర్టీసీ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. రాజధాని చుట్టుపక్కల ఉన్న ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, పశ్చిమ గోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాల నుంచి ఎక్కువ మంది రానున్నారు. సభకు 6600 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క బస్సులో 120 ఆహార పొట్లాలు,100 అరటి పండ్లు, 120 నీటి సీసాలు, 60 ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, 60 మజ్జిగ ప్యాకెట్లు ఉంటాయి. బస్సులు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు సభకు చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు. దారిలో అల్పాహారం, సభకు వచ్చే సమయానికి భోజనం చేసి ప్రాంగణంలోకి చేరుకుంటారు. సభ నుంచి ప్రజలు తిరిగి బస్సు వద్దకు వచ్చే సమయానికి రాత్రి డిన్నర్‌కు సంబంధించిన ఆహారం ఆయా బస్సుల వద్దకు చేర్చే బాధ్యత పౌరసరఫరాల శాఖ తీసుకుంది. సభకు ఎలాంటి వాటర్ బాటిళ్లు తీసుకు రాకూడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# 2వేలు తగ్గిన బంగారం ధర

(మొదటి తరువాయి)

అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడం, రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందానికి సంకేతాలు కన్పించడం, డాలర్ విలువ బలపడుతుండటంతో పుత్తడికి గిరాకీ తగ్గినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. గురువారం ఒక్క రోజే 10 గ్రాముల పుత్తడి ధర దాదాపు రూ.2వేల పైన తగ్గింది. 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.2,180 తగ్గి రూ.95,730 (10 గ్రాములకు) పలుకుతోంది. దాదాపు 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. అటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర కాస్త దిగొచ్చింది. ప్రస్తుతం ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో వరుసగా రెండో రోజు పుత్తడి ధర దిగొచ్చినట్లు- పేర్కొంటు న్నారు. త్వరలోనే అమెరికా ఆర్థిక గణాంకాలు వెలువడున్నాయి. ఇవి కూడా పసిడి ధరలపై ప్రభావం చూపే అవకాశాలున్నట్లు- తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అక్షయ తృతీయ సందర్భంగా దేశీయ మార్కెట్లో బుధవారం బంగారానికి గిరాకీ పెరిగింది. అక్షయ తృతీయ విక్రయాలు రూ.12,000 కోట్ల విలువైన 12 టన్నుల పసిడి, రూ.4,000 కోట్ల విలువైన వెండి కలిపి మొత్తంగా రూ.16,000 కోట్లు-గా ఉండొచ్చని ఆలిండియా జువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు పంకజ్ అరోరా వెల్లడించారు.

# ఎంటర్‌టైన్ మెంట్ హబ్‌గా భారత్

(మొదటి తరువాయి)

సమన్వయం చేయాలని సూచించారు. మనదేశంలో 1913 లో తొలి చిత్రం రాజా హరిశ్చంద్ర విడుదలైందన్నారు. గేమింగ్ రంగంలో యువతకు అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 50 దేశాల గాయకులు కలిసి వైష్ణవ జనతో గీతం ఆలపించారని పేర్కొన్నారు. ప్రతిభ, సృజనాత్మకతల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయాలని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు.నాలుగు రోజులపాటు- ప్రతిష్ఠాత్మకంగా వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంట్టంల్గ÷న్మెంట్ సమ్మిట్ -వేవ్స్ జరగనుండగా, ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీ-స్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఆ కార్యక్రమానికి మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించగా, కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటు-లు అమితాబ్ బచ్చన్ , రణ్‌బీర్ కపూర్ , దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ తారలు పాల్గొన్నారు. అయితే రజనీకాంత్, మోహన్ లాల్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్ కలిసి ఓ గ్రూప్ ఫొటో దిగారు. ఈ పిక్ ఎంతగానో ఆకట్టు-కుంది. చాలా రోజుల తర్వాత ఆ నాటి సీనియర్ హీరోలు అందరు కలిసి ఇలా ఫొటో దిగగా, ఇప్పుడు ఈ పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలనాటి స్టార్స్ ఇలా ఒకే గ్రూప్ పిక్‌లో చూడడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బుధవారమే చిరంజీవి ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్ నుంచి ముంబయి చేరుకున్నారు. ఆయనకి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. వేవ్స్ సమ్మిట్‌కి చిరు చాలా సింపుల్‌గానే వెళ్లారు.

# ఉగ్రవాదులను వెంటాడి వేటాడి పట్టుకుంటాం

(మొదటి తరువాయి)

తొలిసారి స్పందించారు. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేంత వరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పడం ఖాయం. ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టు-కొని శిక్షిస్తాం. కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నాం. దాడి చేసి విజయం సాధించామని అనుకుంటే అది పొరపాటే. ఇది మోదీ సర్కార్. మోదీ సర్కార్ ఎవరినీ వదిలి పెట్టదు. వెంటాడి వెంటాడి అంతం చేస్తుంది. పహల్గామ్‌లో అమాయకుల చావులకు కారణమైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని అన్నారు.

## బలగాల ఆత్మస్థైర్యం

# దెబ్బతీస్తారా

(మొదటి తరువాయి)

పహల్గాంలో ఇటీవల ముష్కరులు జరిపిన పాశవిక దాడితో యావత్ దేశం ఉలిక్కి పడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని దేశమంతా ఒక్కటైంది. ఈ నేపథ్యంలో పహల్గాం దాడి పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని కోర్టు పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దని, ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు- పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణలు కోల్పోయారు. ఈ దాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి గట్టిగా బదులిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది.

# కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

(మొదటి తరువాయి)

అధికారులు మరణాల గురించి సకాలంలో సమాచారం అందుకుంటారని, మరణించిన వారి బంధువుల నుండి అభ్యర్థన వచ్చే వరకు వేచి చూడకుండా బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధృవీకరించడానికి వీలు కలుగుతుందని పేర్కొంది. 1960 ఓటర్ల నమోదు నిబంధనలు, 1969 జనన మరణాల నమోదు చట్టం ప్రకారం ఇటు-వంటి సేకరించే అధికారం ఇసికి ఉంది. ఓటరు సమాచార స్లిప్ లను ఓటర్లకు నచ్చేలా మార్చేందుకు కొత్త డిజైన్‌లను రూపొందించాలని కూడా నిర్ణయించినట్లు- తెలిపింది. ఓటర్ సీరియల్ నెంబర్, పార్ట్ నెంబర్‌లను మరింత స్పష్టంగా కనిపించేలా ఫాంట్ సైజ్‌ను పెంచనున్నామని, దీంతో ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్‌ను సులభంగా గుర్తించవచ్చని, పోలింగ్ అధికారులు ఓటర్ల జాబితాలో వారి పేర్లను సమర్థవంతంగా గుర్తించవచ్చని పేర్కొంది. ఎన్నికల నిబంధనలు-1960, జనన, మరణాల నమోదు చట్టం-1969 ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ సమాచారాన్ని తీసుకునే అధికారం ఉంది. ఓటరు సమాచార చీటీ మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా దాని డిజైన్‌ను మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సీరియల్ నంబర్, పార్టు నంబర్ల సైజును పెంచనున్నట్లు-తెలిపింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్లను తేలికగా గుర్తించడంతోపాటు- అటు- పోలింగ్ అధికారులకు కూడా జాబితాలోని పేర్లను సులభంగా సరిచూసుకునే వీలుంటు-ంది. దీంతోపాటు- బూత్ స్థాయి అధికారులకు కూడా ఫొటో ఐడీ కార్డులను జారీ చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది.

## సంపాదకీయం

# కుడితిలో పడ్డ ఎలుకలా కాంగ్రెస్ !

కులగణనపై కేంద్రం అనూహ్య నిర్ణయం తీసుకోవడంలో రాజకీయ ఎత్తుగడ ఉండే ఉంటుంది. పహల్గాం సంఘటనకు ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో ప్రతిస్పందించే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా కేబినేట్ కులగణన నిర్ణయం తీసుకుంటుందని ఎవ్వరూ ఊహించలేదు. ఓ రకంగా కులగణనతో మోడీని ఇరుకున పెట్టాలని చూసిన రాహుల్‌ను గట్టి దెబ్బే కొట్టారని అనుకోవాలి. తెలంగాణ రోల్ మోడల్ అంటూ రాహుల్ ఎంతగా వగచినా...ఇక్కడ చేసిన కులగణనతో ఒరింగేమీ లేదు. కులగణన చేపట్టామని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి ముందుగా సిఎం సీటును బిసిలకు ఇవ్వలేరు. ఇవ్వాలని రాహుల్ కూడా పట్టుబట్టలేరు. అలాగే కులగణన కావాలంటూ గొంతుచించుకుంటున్న రాహుల్ తమ కుటుంబంలోని మూడు పార్లమెంట్ సీట్లను ముగ్గురు బిసిలకు ఇవ్వలేరు. కేవలం రాజకీయ డ్రామాల కోసం ఏదో ఒక సమస్యను తెరపైకి తేవడం, వాదులాడడం, గొంతు చించుకోవడం తప్ప..నిజంగా పేదలకు మంచి చేయాలన్న ధృఢసంకల్పం రాజకీయ నాయకుల్లో కొరవడుతోంది. దళితులు, ఆదివాసీలు, బిసిల పేర్లు చెప్పి ఓట్లు దండుకునే యత్నం తప్ప మరోటి కాదు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మధ్యలో కొన్నేళ్లు తప్ప కాంగ్రెస్ అధికారంలో ఉన్నా..కులగణనపై నోరు మెదపలేదు. పదేళ్ల యూపిఎ పాలనలో కూడా రాహుల్‌కు ఈ ధ్యాస రాలేదు. మోడీ అధికారంలో రావడం...పాతుకు పోగానే రాజ్యాంగం, కులగణన గుర్తుకు వచ్చి ఊరూవాడా ప్రచారం చేసుకుంటున్నారు. తెలంగాణలో కూడా అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించే ప్రయత్నాలు చేయడం లేదు. ఎన్నికల ముందు ప్రస్తావించిన సమస్యలపై పట్టింపు లేదు. అవినీతిలో కెసిఆర్ మునిగాడని, పదిలక్షల కోట్లు సంపాదించారని పదేపదే పాటపాడుతున్న అధికార కాంగ్రెస్ అవినీతిని రుజువు చేయలేక చతికిల పడింది. అందుకే రాజకీయాల్లో ఎవరి ఎజెండాలు వారివే. వాటిని తిప్పికొట్టేందుకు సహజంగానే ఎత్తులు వేస్తుంటారు. కాంగ్రెస్‌ను మరింత దెబ్బకొట్టే ఉద్దేశ్యంతో ఇక వారికి ఈ అంశంపై మాట్లాడే అవకాశం లేకుండా చేయడమే మోడీ ఎత్తుగడగా కనిపిస్తోంది. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇలాగే చూడాలి. కులగణనకు నెహ్రూ వ్యతిరేకమంటూ, రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ లోక్‌సభలోనే వ్యతిరేకిం చారంటూ బిజెపి నుంచి విమర్శలు వచ్చాయి. మండల్ కమిషన్ సిఫార్సులను ఇందిరాగాంధీయే తొక్కిపట్టారని ఆరోపణలూ ఎక్కుపెట్టారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కులగణన గురించి ఆలోచన చేయలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదన్న బిజెపి ప్రశ్నలకు కాంగ్రెస్ వద్ద సమాధానం లేదు. కాంగ్రెస్ తన విధానాలకు భిన్నంగా కులగణనను ప్రధాన రాజకీయ అజెండాగా మలచుకుని దానిచుట్టే కార్యాచరణను రూపొందించుకుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 400 సీట్ల ఆధిక్యతను సాధించకుండా చేయటంలో కాంగ్రెస్ రాజ్యాంగం, కులగణన ప్రచారం బాగానే అడ్డుపడింది. మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బీజేపీ రద్దుచేస్తుందని కాంగ్రెస్ ముమ్మరంగా ప్రచారం చేసింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా, ఎంతో పకడ్బందీగా తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశామనీ, దీనికి తామే రోల్ మోడల్ అని రేవంత్‌రెడ్డి ఇప్పటికీ పదేపదే ప్రచారం చేస్తున్నారు. అందుకే బిజెపి ఓ రకంగా ఎత్తుకు పైఎత్తు వేసిందనే చెప్పాలి. కాంగ్రెస్ ఎక్కుపెట్టిన కులగణన అస్త్రంను దెబ్బతీసే ఆలోచనలో భాగంగానే బిజెపి జనగణన–కులగణను ఆమోదించి ఉంటుంది. ఓ రకంగా రాజకీయంగా కాంగ్రెస్‌ను దెబ్బకొట్టే ప్రయత్నం గానే చూడాలి. ఇది కాంగ్రెస్ చంకలు గుద్దుకుని ఎగిరే సందర్భం కూడా కాదు. బిజెపిని తక్కువ అంచనా వేసిన రాహుల్ తను తీసుకున్న గోతిలో తానే పడ్డారు. బిజెపి ఇలా చేస్తుందని ఊహించవుండరు. కులగణనపై కాంగ్రెస్ రాజకీయంగా మరింత విజృంభించకుండా బీజేపీ పావులు కదిపిందని చెప్పాల్సిందే. కులంతో పాటు ఉద్యోగ, విద్య, ఆస్తుల వివరాలను పక్కాగా సేకరించి వాటిని బహిరంగపరిస్తే అసలు రంగు బయటపడుతుంది. ఒక్క కులంతోనే సరిపుచ్చకుండా సామాజికంగా వారి అర్థిక స్థిగతులను కూడా వెలికి తీస్తే మంచిది. అప్పుడు కుల జనాభాను బట్టి ఉద్యోగాలు, పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న డిమాండ్‌కు అర్థం లేకుండా పోతుంది. ఎందుకంటే మారిన ప్రపంచ పరిస్థితుల్లో కులాల ఆధారంగా వారి ఆర్థిక సామాజిక పరిస్థితిని నిర్వచించలేని రోజులు ఇవి. కుల రిజర్వేషన్లు వచ్చినా అవి కేవలం..ప్రభుత్వ ఉద్యోగాలకూ, ప్రభుత్వ విద్యాసంస్థలకూ మాత్రమే పరిమితం అయ్యే అవకాశాలే ఎక్కువ. ప్రైవేటు రంగానికి కూడా రిజర్వేషన్లను వర్తింపచేయాలనే డిమాండు ఉధృతమైనా ఆచరించడానికి ఆయా సంస్థలు సిద్ధంగా లేవు. అలా చేస్తే వారు బిచాణా ఎత్తేస్తారు. నిజానికి కులాలకు ఎంతవరకూ రిజర్వేషన్లు ఉండాలన్న విషయంపై రాజకీయంగా ఇప్పటివరకూ ఏకాభిప్రాయం లేదు. కులజనాభాను బట్టి వాటాలు నిర్ణయించి, ఉద్యోగావకాశాలు ఇవ్వాలనే డిమాండ్ వస్తే..అది రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుంది. ముందుగా రాజకీయంగా పదవులను ఇవ్వాలని కోరుతారు. సిఎంలు మొదలు మంత్రుల వరకు ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న వారు చాపచుట్టేసి ఇంట్లో కూర్చోవాల్సి వస్తుంది. రాజకీయ రిజర్వేషన్లు లేకుండా మిగతా చోట్ల డిమాండ్ అన్నది సాధ్యం కాదు. అందుకే కేవలం కులాల లెక్కలు సేకరించడంతో పాటు, ఆర్థిక స్థితిగతులను కూడా పక్కాగా తేలిస్తేనే ఏయే కులాల్లో ఎంతమంది పేదలు ఉన్నారో తేలుతుంది. జనాభా సేకరణలో కులలెక్కలు చేపట్టం మొదలయితే ఇక ప్రతిసారీ ఇది కొనసాగించాల్సి ఉంటుంది. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో పదేళ్లక్రితం వందకోట్లకు పైగా ఖర్చుపెట్టి చేసిన కులగణనపై ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోయారు. ఇప్పటికీ ఆ కుల నివేదికను బయటపెట్టలేక పోతున్నారు. కర్ణాటకలో రెండు ప్రధాన కులాలైన వక్కలిగలు, లింగాయతులు తమ జనాభాను తక్కువగా చూపించారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. తెలంగాణ కులగణనపైనా విమర్శలు ఉన్నాయి. చాలాందిని లెక్కల్లోకి తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో కులగణన ద్వారా ఏం సాధిస్తారో కాంగ్రెస్ చెప్పగలగాలి. పార్టీపరంగా అమలుచేయగలగాలి. అప్పుడే డిమాండ్‌కు అర్థం ఉంటుంది. మొత్తంగా కులగణన చేపట్టాలన్ననిర్నయంతో కాంగ్రెస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యిందనే చెప్పాలి.

# దేశవ్యాప్తంగా కులగణన..!!

-తదుపరి జనాభా లెక్కలతో పాటు నిర్వహణ.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం..!!
-కొన్ని రాష్ట్రాలు రాజకీయ కారణాలతో కులాల లెక్కలు తీశాయి.. అవి అసమగ్రం
-ఇలాంటి వాటితో సమాజంలో సందేహాలు
-ఈ నేపథ్యంలోనే కులగణనకు నిర్ణయం
-దేశంలో సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండాలన్న లక్ష్యమే ఇందుకు కారణం
-కులగణనకు కాంగ్రెస్ తొలినుంచీ వ్యతిరేకం
-మేం జరిపే జన, కులగణనతో దేశం పటిష్ఠం
-ఏ వర్గాన్నీ నొప్పించకుండా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను మేం తీసుకొచ్చాం
-కేంద్ర సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్
-సెప్టెంబరు నుంచి జన, కులగణన ప్రారంభం?



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**న్యూఢిల్లీ, మే 1(ప్రజా స్వేచ్ఛ)**
దేశవ్యాప్తంగా కులగణనకు విపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో.. మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమా వేశంలో.. జనాభా లెక్కలతోపాటే కులగణనను నిర్వహించాలని తీర్మానించారు. తెలంగాణ, కర్ణాటకల్లో కులగణన జరిపిన కాంగ్రెసను రాజకీయంగా తిప్పికొట్టేందుకు మోదీ ఆధ్వర్యంలోని క్యాబినెట్ కమిటీ(సీసీపీఏ) తీసుకున్న ఈ నిర్ణయం 'మాస్టర్ స్ట్రోక్' అని రాజకీయ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. బీజేపీ మాత్రం.. దశాబ్దాలుగా కాంగ్రెస్ ఈ అంశాన్ని విస్మరించిందని విమర్శించగా.. కాంగ్రెస్ అగ్రనేతలు తమ డిమాండ్ నెరవేరిందని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ ఏకంగా మోదీ సర్కారు 'ఆకస్మిక నిర్ణయం' అని పేర్కొంటూ.. కులగణనను స్వాగతించారు. వామపక్షాలు మాత్రం ఇప్పటికే ఆలస్యం జరిగిందని ఆరోపించాయి. బీజేపీ మిత్రపక్షాలు మోదీ సర్కారు నిర్ణయాన్ని స్వాగతించాయి. దేశంలో 'సమ్మిళిత వృద్ధి' వేగం పుంజుకుంటుందని అభిప్రాయపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరులో జన, కులగణనను ప్రారంభించి.. రెండేళ్లలో ముగించనున్నట్లు తెలిసింది. బుధవారం నాటి క్యాబినెట్ భేటీ తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలను వెల్లడిస్తూ.. కాంగ్రెస్‌పై మండిపడ్డారు. తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు నిర్వహించిన కుల సర్వేలు పారదర్శకంగా జరగలేదని, రాజకీయ ప్రయోజనాల కోసం ఆ గణనను పూర్తిచేశారని ఆరోపించారు. తాము జాతీయ స్థాయిలో నిర్వహించబోయే జనాభా లెక్కలతోపాటే కులగణనను పూర్తిచేస్తామని చెప్పారు. "నిజానికి కాంగ్రెస్ పార్టీ కులగణనకు వ్యతిరేకం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చేపట్టిన జనాభా లెక్కల్లో కులగణనను చేర్చలేదు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కుల గణనపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆమేరకు లోక్‌సభకు హామీ ఇచ్చారు. కానీ, మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి.. కులగణనకు బదులు సామాజిక ఆర్థిక సర్వే(ఎసఈసీసీ)-2011ను నిర్వహించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి కులగణనను వాడుకుంటున్నాయి" అని ఆయ న ఆరోపించారు. జనగణన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని అశ్విని వైష్ణవ్ అన్నారు. "భారత రాజ్యాంగంలోని 246వ అధికరణ కింద.. ఏడో షెడ్యూల్‌లో 69వ జాబితాలో జనాభా లెక్కల ప్రస్తావన ఉంది. జనగణన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని రాజ్యాంగం స్పష్టం చేస్తోం ది. కొన్ని రాష్ట్రాలు కులాలపై సర్వేలు చేశాయి. కానీ, ఒకట్రెండు రాష్ట్రాలే సమగ్రంగా సర్వేలను నిర్వహించాయి. మిగతా రాష్ట్రాలు నిర్వహించిన సర్వేల్లో పారదర్శకత లేదు. కేవలం రాజకీయ దృక్కోణంతోనే నిర్వహించాయి. ఇలాంటి అసమగ్ర సర్వేలు సమాజంలో సందేహాలను కల్పిస్తాయి. ఈ నేపథ్యంలో రాజకీయాల వల్ల మన సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండేందుకు కులగణనను జనాభా లెక్కల్లో భాగంగా పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది" అన్నారు. ఉత్తుత్తి సర్వేలు జరపడం తమ లక్ష్యం కాదని తెలిపారు. తాము జరిపే జనగణన, కులగణనతో దేశ సామాజిక, ఆర్థిక నిర్మాణం పటిష్ఠం అవుతుందని, దేశం అభివృద్ధి పథంలోకి పయనిస్తుందన్నారు. దేశ, సమాజ ప్రయోజనాలకు, విలువలకు మోదీ ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో ఈ నిర్ణయంతో స్పష్టమవుతుందన్నారు.

**పాదర్శకంగా నిధులను కేటాయించాలి: ఖర్గే**
కేంద్రం కులగణన కోసం పారదర్శకంగా నిధులను కేటాయించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. తాము ముందు నుంచి జాతీయ స్థాయిలో కులగణనకు డిమాండ్లు చేస్తున్నామని, నిధుల కేటాయింపు జరిగితే కులగణన ప్రారంభమవుతుందన్నారు. ఇంతకాలం మోదీ సర్కారు కులగణన పేరెత్తితే.. విపక్షాలు సమాజాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించిందన్నారు.

**ఆలస్యమైనా మంచి నిర్ణయం: జైరాంరమేశ్**
కులగణనపై మోదీ సర్కారు ఆలస్యంగా స్పందించినా.. ఇది మంచి నిర్ణయమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ అన్నారు. "అసలు కులగణన జరపకపోవడం కంటే.. ఆలస్యమైనా ఆమోదయోగ్యమే" అన్నారు. 2023 ఏప్రిల్ 16న కులగణన కోసం ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాసిన లేఖను, గత నెల 9న అహ్మదాబాద్ సమావేశంలో కులగణనపై చేసిన తీర్మానం ప్రతులను ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా మోదీ సర్కారు కులగణనపై చాలా ఆలస్యంగా నిర్ణయం తీసుకుందని కమ్యూనిస్టు పార్టీలు అభిప్రాయపడ్డాయి. కులగణనపై మోదీ మాటమార్చారని సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ ఆరోపించారు. "కులగణన ప్రస్తావన వస్తే పేదలు, యువకులు, మహిళలు, రైతులు అనే నాలుగు కులాలే సమాజంలో ఉన్నాయని అని మోదీ అనేవారు. ఇప్పుడు మాటమార్చి కులగణనకు సిద్ధమయ్యారు" అని అన్నారు. కులగణన ఎప్పటిలోగా పూర్తవుతుందో కేంద్రం చెప్పాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి డిమాండ్ చేశారు. కులగణనపై చాలా ఆలస్యంగానైనా.. నిర్ణయం తీసుకున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య అన్నారు.

**దేశాభివృద్ధికి దోహదం: నితీశ్‌కుమార్**
దేశవ్యాప్త కులగణన తమ పార్టీ(జేడీయూ) పాత డిమాండ్ అని బిహార్ సీఎం నితీశ్‌కుమార్ అన్నారు. కేంద్రం నిర్ణయం అన్నివర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ.. దేశాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. మొట్టమొదటగా తాము బిహార్‌లో కులగణన జరిపామని జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ అన్నారు. దీన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ కులగణనకు తమనుతామే ఆద్యులుగా చెప్పుకొంటోందన్నారు.

**కాంగ్రెస్ చేయనిది మేం చేస్తున్నాం: షా**
దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయలేని కులగణనను తాము చేపడుతున్నామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో పోస్టు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేపట్టని కాంగ్రెస్..ఇప్పుడు రాజకీయ ప్రయోజనాలతో మాట్లాడుతోందన్నారు.

**బిహార్ ఎన్నికలకోసమే కులగణనప్రకటన: స్టాలిన్**
కులగణనను తిరస్కరించేందుకు, జాప్యం చేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవ్వడంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణనను చేపడతామని ప్రకటించిందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. 'జనగణన ఎప్పుడు ప్రారంభమై ఎప్పుడు ముగుస్తుంది?' అని బుధవారం ఆయన ప్రశ్నించారు. బిహార్ ఎన్నికల్లో సామాజిక న్యాయం కీలకం కాబట్టి, కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే కేంద్రం ఈ ఆకస్మిక చర్యకు ఉపక్రమించిందన్నారు. ప్రతిపక్షాలు ప్రజల్ని కులం ఆధారంగా విభజిస్తున్నాయని విమర్శించిన ప్రధాని.. ఇప్పుడు అదే డిమాండ్‌కు తలొగ్గారని చెప్పారు. కులగణన తమిళనాడు ప్రభుత్వం, డీఎంకే సాధించిన విజయమన్నారు.

**ఆ మూడు రాష్ట్రాలే ఆదర్శం!**
దేశంలో కులగణనకు బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఆదర్శంగా నిలిచాయని చెప్పవచ్చు. నిజానికి భారత్‌లో బ్రిటిష్ హయాంలో 1931లో చివరిసారిగా జనాభా లెక్కలతో పాటు.. కులగణనను నిర్వహించారు. స్వాతంత్ర్యం తర్వాత.. 1951 నిర్వహించిన జనగణనలో.. కులగణనను తొలగించారు. దాంతో.. 1931లో నమోదైన ఓబీసీల లెక్క మేరకు ఆ కేటగిరీకి 27% రిజర్వేషన్లను కొనసాగిస్తున్నారు. 2011లో కులగణనను నిర్వహించాలని నిర్ణయించినా.. సామాజిక ఆర్థిక సర్వే(ఎసఈసీసీ)ను చేపట్టారు. ఆ డాటాను ఇప్పటికీ విడుదల చేయలేదు. అయితే.. సామాజిక న్యాయం కోసం కులగణన జరిగి తీరాల్సిందేననే డిమాండ్లు ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. బిహార్ ప్రభుత్వం మాత్రం 2023లో కులగణను చేసి, చూపించింది. న్యాయపరమైన అవాంతరాలెదురైనా.. బాలారిష్టాలను దాటుకుని, ముందుకు సాగింది. 13 కోట్ల బిహార్ జనాభాలో(2011 జనాభా లెక్కల ప్రకారం 10.41 కోట్లు) 63.14% ఓబీసీలు ఉన్నట్లు తేల్చింది. దాంతో.. 63% ఉన్న జనాభాకు 27% కోటా న్యాయమేనా? అనే చర్చ మొదలైంది. బిహార్‌లో ఆర్థికంగా మరీ వెనకబడిన కులాలు మొత్తం జనాభాలో 36.01 శాతంగా ఉండడంతో.. కోటా పెంపు డిమాం డ్ మొదలైంది. దాంతో కాంగ్రెస్ పార్టీ కులగణన అంశాన్ని ఎన్నికల్లో ప్రముఖంగా ప్రస్తావించింది. కర్ణాటకలోనూ ఇచ్చిన హామీ మేరకు కులగణనను జరిపింది. నిజానికి కర్ణాటకలో 2015లోనే కులగణన మొదలై.. 2018 నాటికి సర్వే పూర్తయినా 2024లో బీసీ కమిషన్ చైర్మన్ జయప్రకావ్ హెగ్డే ప్రభుత్వానికి నివేదికను ఇచ్చారు. దీని ప్రకారం కర్ణాటకలో ఈబీసీల వాటా 69.6%. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ కులగణన హామీని నెరవేర్చింది. 50 రోజులపాటు 1.03 లక్షల మంది ఎన్యుమరేటర్లు కులగణనను నిర్వహించగా.. 96.9% కుటుంబాలు వివరాలను వెల్లడించాయి. మొత్తం 3.54 కోట్ల మందిని సర్వే చేయగా.. బీసీల వాటా 46.25శాతంగా తేలింది. ముస్లిం మైనారిటీల్లో బీసీలను కలుపుకొంటే ఈబీసీల వాటా 56.33శాతం ఉంది. ఈ డాటాను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీని ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తూ 2బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లులను కేంద్రానికి పంపి, వీటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరింది.

**50% కోటా ఎత్తివేతకు మార్గం: రాహుల్**
మోదీ సర్కారు కులగణనపై తీసుకున్న 'అకస్మాత్' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. 11 ఏళ్లుగా ఈ అంశాన్ని విస్మరించి, ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారని, అయినా.. కాలపరిమితిని చెప్పలేదని విలేకరులతో అన్నారు. "ఇది ముమ్మాటికీ తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిన అంశమే. ఇంతకాలం 50% రిజర్వేషన్ కోటా నిబంధనలో ఉన్నాం. కులగణన జరిగితే.. ఆ పరిమితిని దాటడానికి మార్గం సుగమమవుతుంది. ఆ పరిమితిని ఎత్తివేసేదాకా మేం పోరాడుతాం. మేము కోరుకునేది జనాల కులగణన మాత్రమే. బ్యూరోక్రాట్ల కులగణన కాదు" అని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే కేంద్రం కులగణనకు సన్నద్ధమైందని పేర్కొన్నారు.

**సమ్మిళిత వృద్ధిపై నిబద్ధత: చంద్రబాబు**
దేశంలో సమ్మిళిత వృద్ధిపై ప్రధాని మోదీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనం కులగణన నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమని, దీని వల్ల సమాజంలో అణగారిన వర్గాలకు మేలు జరిగే విధానాల రూపకల్పన సుసాధ్యమవుతుందన్నారు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాసతో దేశంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ఏ క్షణంలోనైనా పాక్‌పై దాడి..!!

-సర్వసన్నద్ధమవుతున్న భారత్!
-అమెరికా, చైనా సహా పలు దేశాలకు పరిస్థితిని వివరించిన విదేశాంగ శాఖ
-పీ5 దేశాలతో జైశంకర్ చర్చలు
-తాలిబాన్ కూడా మనవైపే..
-సీసీఎస్ భేటీలో సైనిక సన్నద్ధతపై ప్రధాని సమీక్ష
-కీలక విన్యాసాలు ప్రారంభించిన త్రివిధ దళాలు
-జాతీయ భద్రతా సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణ
-చైర్మన్‌గా 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి
-తెలుగు అధికారి వెంకటేశ్ వర్మకూ స్థానం
-మాపై నేడో, రేపో సైనిక దాడి
-మా దగ్గర విశ్వసనీయ సమాచారం ఉంది
-దాడి చేస్తే భారత్‌కు మూల్యం తప్పదు
-పాకిస్థాన్ సమాచార మంత్రి తరార్ వ్యాఖ్య




**న్యూఢిల్లీ, మే 1(ప్రజా స్వేచ్ఛ)**
పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు భారత్ సిద్ధమవుతోందా? ఏ క్షణంలోనైనా పాక్‌పై విరుచుకుపడేందుకు సన్నద్ధమవుతోందా? దాయాదికి గట్టి గుణపాఠం నేర్పనుందా? పహల్గాం ఉగ్రదాడికి బదులు తీర్చుకోనుందా? అంటే.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని చూస్తే అవుననే సమాధానం వస్తుంది. పాకిస్థాన్ కూడా తమపై నేడో రేపో దాడి జరగడం తథ్యమని భావిస్తోంది. కాగా, 2018 నుంచీ పెద్దగా పనిలేకుండా ఉన్న జాతీయ భద్రతా సలహా బోర్డును మోదీ సర్కారు తాజాగా పునర్వ్యవస్థీకరించింది. 'రా' మాజీ చీఫ్‌ను చైర్మన్‌గా, ఆరుగురు కీలక అధికారులను సభ్యులుగా నియమించింది. పాక్ సీమాంతర ఉగ్రవాదం గురించి చాటిచెప్పడంతోపాటు తాము తీసుకోబోయే చర్యలను వివరించేందుకు భారత్ జీ-20, గ ల్ఫ్ దేశాలతో సహా ఇప్పటికే 25 ప్రధాన దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తాలిబాన్‌ను కూడా విశ్వాసంలోకి తీసుకున్నట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడిని తాలిబాన్ తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలో పాకిస్థాన్ ఇప్పటికే తాలిబాన్ తిరుగుబాటును ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో భారత విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి ఆనంద్ ప్రకాశ్ నేతృత్వంలో భారత ప్రతిని?ధులు కాబూల్ చేరుకుని తాలిబాన్ విదేశాంగ మంత్రితో చర్చలు జరిపారు. తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్వయంగా పీ5 దేశాలైన అమెరికా, చైనా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో మాట్లాడారు. మరోవైపు బుధవారం రెండోసారి జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ప్రధాని మోదీ త్రివిధ దళాల సన్నద్ధతపై సమీక్షించారు. త్రివిధ దళాలు ఇప్పటికే కీలక విన్యాసాలు ప్రారంభించాయని అధికారులు ప్రధానికి వివరించినట్లు తెలిసింది. భారత వైమానిక దళం 'ఆక్రమణ్' పేరుతో నేలపై, పర్వతాలపై


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

దాడులు జరిపేందుకు విన్యాసాలు ప్రారంభించగా, ఆర్మీ నైరుతి కమాండ్ తమ దళాలకు ఆయుధాల ప్రయోగంలో శిక్షణను ముమ్మరం చేసింది.

**పాక్ కాల్పులు.. భారత్ ఎదురుకాల్పులు..**
జమ్మూకశ్మీరులోని పరగవాల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద నిబంధనలను ఉల్లంఘించి బుధవారం పాక్ దళాలు కాల్పులు జరిపాయి. వారికి మన సైన్యం ఎదురు కాల్పులతో దీటైన జవాబిచ్చింది. మరోవైపు సింధు జలాల ఒప్పందం రద్దును అమలు చేసే విషయమై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ బుధవారం రాత్రి కీలక చర్చలు జరిపారు.

**జాతీయ భద్రతా సలహా బోర్డు..**
భారతదేశ రక్షణ పరిస్థితిని విశ్లేషించి, ఎప్పటికప్పుడు సిఫారసులు చేసేందుకు గాను జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించారు. దీనికి చైర్మన్‌గా రా మాజీ చీఫ్ అలోక్ జోషీని నియమించారు. ఈ బోర్డులో ముగ్గురు సైనిక నేపథ్యం, ఇద్దరు పోలీసు నేపథ్యం, ఒకరు విదేశాంగ వ్యవహారాల నేపథ్యం కలిగిన వారు ఉన్నారు. సదరన్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, వెస్ట్రన్ ఎయిర్ మాజీ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, మాజీ రేర్ అడ్మిరల్ మాంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్ అధిరులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, విదేశాంగ శాఖ మాజీ అధికారి బి.వెంకటేశ్ వర్మ వీరిలో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ ఐఎఫ్ఎస్ అధికారి వెంకటేశ్ వర్మ హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో, నిజాం కాలేజీలో చదివారు. 1988 బ్యాచ్ అధికారి అయిన వర్మ.. రష్యా, చైనా దేశాలకు రాయబారిగా పనిచేశారు. భారత్-అమెరికా అణు ఒప్పందంలో కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్‌పై తదుపరి దశ ఆంక్షలు, దాడులపై ఈ బోర్డు సలహాలు ఇవ్వనుంది.

**పాక్‌కు మన గగనతలం బంద్**
పాకిస్థాన్‌కు చెందిన అన్ని రకాల విమానాలకు గగనతలాన్ని మూసివేస్తూ భారత్ బుధవారం నిర్ణయం తీసుకుంది. పాక్ ఇప్పటికే భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. తాజాగా భారత్ ఆ చర్య తీసుకుంది. దీనితో పాక్ నుంచి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లే విమానాలు.. చైనా లేదా శ్రీలంక మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. ఇప్పటికే ఆర్థికంగా కుదేలైన పాక్ విమానయాన సంస్థలకు దీనితో మరింత దెబ్బతగలడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు.

**786 పాకిస్థాన్‌కు.. 1,465మంది భారత్‌కు..**
పాకిస్థానీల వీసాల రద్దు నిర్ణయం తర్వాత భారతదేశం నుంచి 786 మంది పాక్ దేశస్థులు వెళ్లిపోయారు. వీరిలో దౌత్యవేత్తలు, వారి కుటుంబసభ్యులు, సిబ్బంది కూడా ఉన్నారు. వీరితో పాటు పాక్ వీసా కలిగి ఉన్న 8 మంది భారతీయులు కూడా వెళ్లిపోయారు. మరోవైపు, పాకిస్థాన్ నుంచి 1,465 మంది ఇండియాకు వచ్చారు.

## రాహుల్ గాంధీ ఐడియాని మోదీ సర్కారు కాపీ కొట్టి అమలు చేస్తుంది

**- కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**




**న్యూస్ సంగారెడ్డి:మే 1(ప్రజా స్వేచ్ఛ)**
కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గాంధీ భవన్ లో నిర్వహించిన విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కులగణన చేయాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశమంతా ఒక్కతాటిపైకి తెచ్చారని, ఇదే ఐడియాని మోదీ సర్కారు కాపీ కొట్టి అమలు చేస్తున్నారని జగ్గారెడ్డి అన్నారు. కాగా దేశంలో అన్ని రాష్ట్రాల్లో కంటే ముందే తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి కులగణన నిర్వహించి జాక్ పాట్ కొట్టారని, కులగణన అసాధ్యం కానీ పని అన్నటువంటి బీజేపీ ప్రభుత్వంతోనే కులగణన చేసేటట్టు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన నాయకుడు రాహుల్ గాంధీ అని మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

## ఘనంగా 139 వ, మేడే వేడుకలు.


**-కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పలు యూనియన్ల నాయకులు.**



**మే 1(ప్రజా స్వేచ్ఛ) మంచిర్యాల జిల్లా**
పట్టణంలో 139వ మే డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహిస్తూ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చారిత్రాత్మక మేడే ఆవిర్భావ నేపథ్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకుని వారి త్యాగాలకు పలువురు కార్మిక సంఘ నాయకులు, రాజకీయ నాయకులు ఘన నివాళులర్పించారు. సిపిఐ కార్యాలయం ఆవరణలో, సిహెచ్పి సమీపంలో ఏఐటియుసి నాయకులు అక్బర్ ఆలీ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో తేజావత్ రాంబాబు,పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, సీఐటియు కార్యాలయం ఆవరణలో పార్టీ నాయకులు సాంబారి వెంకటస్వామి, రామగిరి రామస్వామి, సింగరేణి సివిల్ కార్యాలయంలో ఐఎన్టియూసీ నాయకులు సంగ బుచ్చయ్య యాదవ్,శ్రీనివాస్ గౌడ్,మేకల రాజయ్య,యాకుబ్ ఆలీ, రజక సంఘం కార్యాలయం ఆవరణలో అధ్యక్షుడు నడిగోట తిరుపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులు గాండ్ల సమ్మయ్య, అధ్యక్షులు జిలకర రాయమల్లు లు జెండాలు ఎగరవేసి మే డే దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలి

**-ఎంఈఓ ప్రతాప్ రెడ్డి...**



**పాపన్నపేట, మే 1(ప్రజా స్వేచ్ఛ)**
పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నేటి నుండి 16వ తేదీ వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ,, ఆరో తరగతి నుండి 9వ తరగతి వరకు చదివే బాల బాలికలలు ఈ క్యాంపుకు అర్హులన్నారు. ఈ క్యాంపులో డ్రాయింగ్, క్రాఫ్ట్, కరాటే, కుట్లు, అల్లకం, డ్యాన్స్, వివిధ రకాల ఆట పాటలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనునట్లు ఆయన తెలిపారు ఈ సమ్మర్ క్యాంప్ ను 15 రోజులపాటు పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపుకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ తో పాటు మంచినీటి సౌకర్యం కల్పించనునట్లు ఆయన తెలిపా రు పూర్తి వివరాలకు 8500200859 నెంబర్ ను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు. వీటిని నేర్పడానికి అర్హత గల ఇన్స్పెక్టర్లు తమను సంప్రదించాలని వీరికి ఒకరికి రూపాయలు 3000 చొప్పున చెల్లించడం జరుగుతుందని ఆయన వివరించారు.

# కేసీఆర్ మాటలు నమ్మి మోసపోకండి




-సమ్మె ఆలోచన విరమించండి
- ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ప్రతి నెలా రాష్ట్ర ఆదాయం రూ.18 వేల కోట్లు
- ప్రభుత్వ కనీస వ్యయం రూ.22 వేల కోట్లు
- ఈ మొత్తం అప్పులు, వడ్డీలకే పోతుంది
- క్లిష్ట సమయంలో సహకరించాలని ప్రజలకు వినతి
- రవీంద్రభారతిలో ఘనంగా మేడే వేడుకలు

**హైదరాబాద్ మే 1(ప్రజా స్వేచ్ఛ)**
"సమ్మె ఆలోచన విరమించండి. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల బాటలో పయనిస్తోంది. ఇది మీ సంస్థ. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంది. గత పదేండ్లలో ఆర్థిక విధ్వంసం జరిగింది. పంతాలు, పట్టింపులకు పోకండి. ఏవైనా సమస్యలుంటే సంబంధిత మంత్రితో చర్చించండి. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచించండి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రాష్ట్రం సమ్మె వల్ల తీవ్రంగా నష్ట పోనుంది. సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గత సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్రం సంక్షోభంలో కూరుకు పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ పద్మనాభం లాగా ఆచి తూచి ఖర్చు చేస్తున్నా ప్రతి నెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. "ప్రభుత్వానికి ప్రతినెలా రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తోంది. గత ప్రభుత్వం చేసిన అప్పులపై కిస్తీలకు రూ.6.5 వేల కోట్లు పోతోంది. ఉద్యోగుల జీతభత్యాలకు రూ.6 వేల కోట్లు ఖర్చవుతోంది. ప్రతి నెలా రూ.22 వేల కోట్లు వస్తే తప్ప ప్రభుత్వ కనీస అవసరాలు తీరవు. మాజీ సీఎం కేసీఆర్ రూ.8.15 లక్షల కోట్ల అప్పు చేసి పదవి దిగి వెళ్లిపోయారు. అప్పుడు చేసిన అప్పులన్నీ ఎక్కడికి పోయాయో ఆనవాళ్లు తెలియడం లేదు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు 15 నెలల్లో రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేయాల్సి వచ్చింది. ఆర్థికంగా రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కొత్త డిమాండ్లు చేసే ముందు ఆలోచించండి.


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు
రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# పిండిప్రోలు, జల్లేపల్లిలో బిల్డింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు



తిరుమలాయపాలెం మే 1(ప్రజా స్వేచ్ఛ)

మండల పరిధిలోని పిండిప్రోలు, జల్లేపల్లి గ్రామాల్లో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ సిఐటియు, ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఘనంగా మే డే ఉత్సవాలు జరుపుకొని 139 వ అరుణ పతాక జెండాల ను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గ్రామ అధ్యక్షులు పప్పుల మాణిక్యరావు, జల్లేపల్లిలో ఎలక వీరస్వామి ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ సలీం దాదే రాము దామల్ల క్రాంతి కుమార్ పదముత్తు దేవ పదముత్తు రమేష్ మట్ట నాగరాజు షేక్ లాల్ మచ్చ గిరి షేక్ యాకుబ్ ఎస్.కె రషీద్ అక్కిన పోయిన నాగ చారి పప్పుల నరసింహారావు కోరపాటి శ్రీను గడదాసు వెంకన్న, జల్లేపల్లిలో గాదరి వీరస్వామి, ఉప్పయ్య, సీతయ్య, మల్సూరు, రామారావు, వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారుద

# సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేత




తిరుమలాయపాలెం మే 1(ప్రజా స్వేచ్ఛ)

తిరుమలయపాలెం మండలం రాజారం గ్రామనికి చెందిని వీరబోయిన లింగయ్య ఇటీవల అనారోగ్యం బాధపడుతూ సర్జరీ చేయించుకోగా, మాజీ ఏమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి సూచన మేరకు ఉప్పల్ ఏమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సిపారసుతో రూ 31,500/- మంజూరు కాగా,బాదితునికి తన నివాసంలో గురువారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు రంగాపురం బాలకృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బాణాల బస్వా రెడ్డి, సౌడోజు రవీంద్ర చారీ, రంగాపురం రవి, జంపాల రమేష్, తిరుమలరెడ్డి రవీందర్ రెడ్డి, మందుల ఎల్లయ్య, సామ బిక్షంరెడ్డి, కందాళ సురేందర్ రెడ్డి, పేర్ల సంపత్, పేర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో మేడే కార్యక్రమం

-పాల్గొన్నవారు దళిత రత్న అవార్డు గ్రహీత,పంబల రాజు.పత్యారా నరసింహా




రాజేంద్ర నగర్ మే 1(ప్రజా స్వేచ్ఛ)

మే డే సందర్భంగా రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ కి పూలమాలవేసి ఘనంగా మేడే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది దళిత రత్న అవార్డు గ్రహీత పత్యా రా నరసింహ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో పాల్గొన్నవారు దళిత రత్న అవార్డు గ్రహీత, పంబల రాజు. నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్. ఏర్పుల కుమార్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గొడుగు సంజీవ జయంతి ఉత్సవ కమిటీ మాజీ, అధ్యక్షులు పచ్చ నర్సింగ్ రావు మరియు మంత్రి చంద్రశేఖర్ రాజేంద్రనగర్ నియోజకవర్గం మాలల ప్రతినిధి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఝాన్సీ రెడ్డి కన్నయ్య పలు లేబర్ నాయకులు పాల్గొని యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

# మే డే స్ఫూర్తితో ఉద్యమించాలి

– రెడ్యానాయక్ తండా

దూల్మెట మే 1(ప్రజా స్వేచ్ఛ)


139 మేడే సందర్భంగా హమాలీ సంఘం ఆధ్వర్యంలో దూల్మెట మండల లో నీ రెడ్యానాయక్ తండా కేంద్రంలో అమరవీరుల స్తూపం వద్ద లావుడియా హరి ఎర్రజెండాను ఎగరవేసి అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో హమాలీ, భవన్ నిర్మాణం, ఆటో ,ట్రాక్టర్ డ్రైవర్స్ అన్ని రంగాల కార్మికులు ఎర్రజెండాలు ఎగురవేసి కార్మికుల ఐక్యతను చాటారని తెలిపారు. కార్మికుల గౌరవాన్ని మరియు ఐక్యత యొక్క శక్తిని మనం స్మరించుకుందాం. ప్రతి శ్రమించే చేయి మన సమాజ భవిష్యత్తును నిర్మిస్తుంది. గర్వంతో, సంకల్పంతో, ఆశతో ముందుకు సాగుదాం.కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు మే డే స్ఫూర్తితో పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప నినాదంతో కార్మిక వర్గ హక్కులను కాపాడుకోవడం కోసం అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో, దారవత్ మోహన్, రాజా, జబర్, నాత, రఘుపతి, రమేష్ సంపత్, నాగు, రవి, మంజి,కార్మికులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధిలో యువత పాత్ర కీలకం

-అన్ని రకాల ఆన్లైన్ సేవలకు సంబంధించి ఎ టు జెడ్ ఆన్లైన్ సర్వీసెస్ ప్రారంభం

-ప్రారంభించిన ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ రెడ్డి

-కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్, బీఆర్ఎస్ నాయకుడు సుధీర్




షాద్ నగర్, మే 1(ప్రజా స్వేచ్ఛ)

సమాజంలో యువత పాత్ర ఎంతో కీలకమైందని, రాజకీయపరంగానైనా, వ్యాపార పరంగా నైనా, సమాజ సేవ పరంగా నైనా యువత ముందుండి నడిపించాలని, స్వశక్తితో తమ కాళ్లపై తాము నిలబడి ఎందరో యువకులు వ్యాపార రంగంలో రాణిస్తున్నారని, అలాగే కలిమొద్దీన్ కూడా వ్యాపార రంగంలో అద్భుతంగా రాణించాలని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. స్థానిక అయ్యప్ప కాలనీలో ఏ టు జెడ్ ఆన్లైన్ మొబైల్ సర్వీసెస్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డిని, మాజీ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్ ను, బీఆర్ఎస్ యువ నాయకుడు సుదీర్ ను యజమాని కలిమొద్దీన్ సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సన్మానించి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ఎ టు జెడ్ ఆన్లైన్ సర్వీసెస్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి యువత స్వశక్తితో, ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా తమకున్న నైపుణ్యంతో వ్యాపార రంగంలో రాణించాలని, తద్వారా సమాజానికి మంచి సేవ చేసిన వారు అవుతారని, కుటుంబ బాధ్యతలను పంచుకున్న వారు అవుతారని, సమాజాన్ని అభివృద్ధి పరిచిన వారవుతారని, స్వశక్తితో తనకున్న నైపుణ్యంతో యువతేజం కలీమొద్దీన్ ఎ టు జెడ్ ఆన్లైన్ సర్వీస్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషకరమని, వ్యాపారంలో ఉన్నతంగా రాణించాలని, ఆ భగవంతుని ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉండాలని కలీమొద్దీన్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎ టు జెడ్ ఆన్లైన్ సెంటర్ యజమాని కలిమొద్దీన్ తమ ఆన్లైన్ సెంటర్ లో అన్ని రకాల ఆన్లైన్ అప్లికేషన్లు, అన్ని రకాల ఆన్లైన్ జాబ్ అప్లికేషన్లు, ఆధార్ సర్వీసులు, భూ భారతి సర్వీసులు, పాన్ కార్డు అప్లికేషన్లు, పాస్ పోర్ట్ సర్వీసులు, ఓటర్ ఐడి కార్డ్ అప్లికేషన్లు, ఆర్టిఏ మరియు ప్రాపర్టీ టాక్స్ చెల్లింపులు, వాహనాల ఇన్సూరెన్సులు, మున్సిపల్ ట్రేడ్ లైసెన్సులు, కార్మికుల లైసెన్సులు, నగదు లావాదేవీల చెల్లింపులు, ఎం ఎస్ ఎం ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్లు, ప్రధానమంత్రి కిసాన్ యోజన అప్లికేషన్లు, ఇంకా అనేక రకములైన ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆన్లైన్ సెంటర్ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

# వనపర్తికి ఈ ఎస్ ఐ ఆస్పత్రి





-కార్మికులను కడుపులో పెట్టి చూసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-వనపర్తి మున్సిపల్ కార్మికులను సన్మానించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

వనపర్తి,మే 1(ప్రజా స్వేచ్ఛ)

వనపర్తి నియోజకవర్గ పరిధిలోని కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు త్వరలోనే వనపర్తి జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు మే డే కార్మిక దినోత్సవ సందర్భంగా గురువారం వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మున్సిపల్ కార్మికులను శాలువల తో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో లక్షలాదిమందికి నిరంతరాయంగా సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు సిబ్బంది కొరత తీర్చేందుకు కొత్త నియమకాలను చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు మున్సిపల్ చట్టం ప్రకారం కార్మికులకు అందించే ప్రతి బెనిఫిట్ ను అందేలా చూస్తామని ఎమ్మెల్యే సూచించారు .అనంతరం వనపర్తి పట్టణం బసవన్నగడ్డ లో లైట్ మోటార్ వెహికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఆటో యూనియన్, ట్రాక్టర్స్ యూనియన్, కార్మికులకు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో కమిషనర్, కార్యాలయ సిబ్బంది, వనపర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ కౌన్సిలర్లు, లైట్ మరియు హెవీ వెహికల్స్ సంఘం అధ్యక్షులు అయూబ్ ఖాన్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరులో ఘనంగా మేడే ఉత్సవాలు

--సిపిఐ, సిపిఎం, ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో

- కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలి

-వామపక్ష నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, బొల్లం అశోక్ ల డిమాండ్






తొర్రూరు మే 1(ప్రజా స్వేచ్ఛ)

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వర్గ ప్రయోజనాలను నష్టపెట్టే నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని మేడే సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు బొల్లం అశోక్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం 139వ మేడే సందర్భంగా తొర్రూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలో సిపిఐ ,సిపిఎం, సిఐటియు, ఏఐటియుసి, మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు .వివిధ కూడళ్లలో ఎర్రజెండాలు ఆవిష్కరించి, కార్మికులు పెద్ద ఎత్తున గాంధీ సెంటర్ నుండి, బస్టాండ్ మీదుగా, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వరకు ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని కంటాయపాలెం, అమ్మాపురం, ఖానాపురం, గుర్తూరు, కప్పుర్య తండా, గోపాలగిరి గ్రామాలలో జెండాల ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష నాయకులైన తమ్మెర విశ్వేశ్వరరావు, బొల్లం అశోక్, ఎండి యాకూబ్, ఓమ బిక్షపతి ,బందు మహేందర్, జమ్ముల శ్రీను, గణపురం లక్ష్మణ్, సోమిరెడ్డి లు సంయుక్తంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వామపక్ష భావజాలాన్ని తుడిచిపెట్టడం కోసం, ప్రయత్నాలు చేస్తూనే, అందులో భాగంగా మూడు లేబర్ కోర్టు చట్టాలను తీసుకొని వచ్చి, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నది. దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే 8 గంటల పని దినాన్ని తుడిచి పెట్టాలని ,ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో 12 గంటల పని దినాలను, మతోన్మాద బీజేపీ ప్రభుత్వం తీసుకొని వస్తుందని అంతేకాకుండా కార్మిక వర్గాన్ని నష్టపెట్టి చట్టాలను తీసుకొని వచ్చి, కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసి ,నయా పెట్టుబడిదారీ వ్యవస్థను తీసుకురావడం కోసం తన ప్రయత్నాలు చేస్తున్న విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇటువంటి చట్టాలను రద్దు చేయడం కోసం దేశవాపిత సమ్మెను ఈ నెల 20వ తారీకు నాడు కార్మిక సంఘాలు భారత్ బంద్ కు పిలుపునివ్వడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం తలవగ్గి ప్రమాదకరమైన కార్మిక వర్గ ప్రయోజనాల నష్టపరిచే నల్ల చట్టాలను రద్దు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్త వెంకటరెడ్డి, మార్క సాంబయ్య, తాళ్ల వెంకన్న,బోరా స్వామి, ధరావత్ యాకన్న, తిమ్మిడి రవి, మంగళపల్లి మల్లయ్య, వెంకన్న, ఎల్లయ్య, పెయింటర్ యూనియన్ నాయకులు మహేందర్, మహేష్,నాగరాజు, మార్బుల్ యూనియన్ నాయకులు పండిత్ శర్మ, హమాలీలు దయాకర్, ఎల్లయ్య, దొమ్మటి సోమయ్య, ఉమగాని యాకయ్య, జితేందర్, నజీర్, అమీర్,ఏకాంతం, సివిల్ సప్లై హమాలీలు, వెలిసాల ప్రభాకర్ పల్లె సైదులు, హమాలీలు వీరన్న,వెంకన్న, దూడయ్య యాకయ్య, బిక్షపతి, యాకయ్య, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బిక్షపతి, శ్యామ్, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# పసిడి కొనేవారికి గుడ్‌న్యూస్.. ఒక్కరోజే రూ.2వేలు తగ్గిన బంగారం ధర

గత కొంత కాలంగా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలకు బ్రేక్ పడింది. దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర గత కొన్ని రోజులుగా కాస్త దిగొస్తోంది. లక్ష రూపాయలు అధిగమించిన తులం పుత్తడి ధర యూ టర్న్ తీసుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో ఒక్కసారిగా ధరలు దిగొస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం నాడు బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఒక్క రోజులోనే ఏకంగా తులం బంగారం రూ.2 వేలకుపైనే తగ్గింది.దేశ రాజధాని ఢిల్లీలో నేడు 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.95,880 పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల పుత్తడి ధర రూ.87,900గా ఉంది. ముంబై, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, భువనేశ్వర్ వంటి ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.95,730గా, 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.87,750గా పలుకుతోంది. దాదాపు 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. ఇక కిలో వెండి ధర రూ. 99,900 పలుకుతోంది.



# రికార్డు స్థాయిలో ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు..

### మొత్తం ఎన్ని లక్షల కోట్లు వచ్చాయంటే..?




జీఎస్టీ వసూళ్లు ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో వసూలయ్యాయి. రూ.2.37లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గత మార్చి నెలలో జీఎస్టీ వసూళ్లు 1.96లక్షల కోట్లు వసూలైన విషయం తెలిసిందే. గతేడాది ఏప్రిల్ నెలలో వసూళ్లు రూ.2.10 లక్షల కోట్లుగా ఉన్నది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై ఒకటి నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా ఏప్రిల్-2025 రికార్డులకెక్కింది. ఇక గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. ఏప్రిల్ నెలలో మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయని కేంద్రం విడుదల చేసిన గణాంకాలు తెలిపాయి.గతేడాదితో పోలిస్తే మొత్తం 10.7శాతం పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం పెరిగి రూ.46,913 కోట్లకు చేరింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అయితే, రీఫండ్స్ 48.3శాతం ఎక్కువగా ఉండడంతో నికర ఆదాయం 9.1శాతం తగ్గింది. త్రైమాసిక వసూళ్లలో 10.4 శాతం వృద్ధి నమోదవగా.. 2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నమోదైన 8.3 శాతం వృద్ధి కంటే చాలా ఎక్కువ. ఏప్రిల్ నెలలో వసూళ్లు రూ.1.8 లక్షల కోట్ల మార్క్ దాటడం ఇది వరుసగా నాలుగోసారి.

# జూన్ 16 నుంచి.. వేగంగా యూపీఐ లావాదేవీలు

**న్యూఢిల్లీ**


యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు జూన్ 16 నుంచి వేగవంతం కానున్నాయి. కొన్ని సేవల ప్రతిస్పందన సమయం గణనీయంగా తగ్గనున్నది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) దీని కోసం ఒక విధానాన్ని రూపొందించింది. ఏప్రిల్ 26న దీనికి సంబంధించిన ఉత్తర్వును జారీ చేసింది. వివిధ కేటగిరీల యూపీఐ లావాదేవీల కోసం సవరించిన సమయపాలనను అందులో ప్రకటించింది.కాగా, డెబిట్, క్రెడిట్ చెల్లింపుల సమయం ఇప్పటి వరకు ఉన్న 30 సెకన్లకు బదులుగా 15 సెకన్లు ఉంటుంది. లావాదేవీల స్థితిని తెలుసుకోవడానికి గతంలో ఉన్న 30 సెకన్ల సమయాన్ని 10 సెకన్లకు సవరించారు. అలాగే లావాదేవీల రివర్సల్ కోసం ఉన్న ప్రతిస్పందన సమయం 30 సెకన్లను తాజాగా 10 సెకన్లకు తగ్గించారు. చిరునామా ధృవీకరణ సమయాన్ని 15 సెకన్ల నుంచి 10 సెకన్లకు కుదించారు. మరోవైపు




ఇటీవల యూపీవీ లావాదేవీల్లో సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో యూపీఐ వినియోగదారులకు మెరుగైన సేవల కోసం ఈ సవరణలు చేస్తున్నట్లు ఎన్‌పీసీఐ పేర్కొంది. బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు (పీఎస్‌పీ)లు తమ వ్యవస్థలో ఈ మేరకు అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించింది. సవరించిన సమయ ప్రతిస్పందనలకు అనుగుణంగా అన్ని భాగస్వామ్య, వ్యాపార, ఇతర పక్షాలు చర్యలు చేపట్టాలని పేర్కొంది.

# చాహల్ హ్యాట్రిక్.. ఆర్జే మహవేశ్ పోస్ట్ వైరల్..!


ఐపీఎల్ 18వ సీజన్‌లో యజ్వేంద్ర చాహల్ తొలి హ్యాట్రిక్ సాధించాడు. చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచుల్లో వరుస బంతుల్లో దీపక్ హుడా, అన్షుల్ కంబోజ్, నూర్ అహ్మద్‌లను ఔట్ చేసి హ్యాట్రిక్ వీరుడిగా రికార్డు నెలకొల్పాడు యుజీ. తన సంచలన బౌలింగ్‌తో చెన్నైని 200లోపే కట్టడి చేసి. పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించిన చాహల్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే అతడి ప్రేయసిగా వార్తల్లో నిలుస్తున్న ఆర్జే మహవేశ్ స్టోరీస్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట వైరలవుతోంది. ఇంతకూ తను ఆ పోస్ట్‌లో ఏం రాసిందో తెలుసా?ఇక టీ20ల్లో కథ ముగిసిపోయింది అనుకున్న వేళ.. గోడకు కొట్టిన బంతిలా పుంజుకున్నాడు చాహల్. ఆరంభ మ్యాచుల్లో సత్తా చాటలేకపోయిన చాహల్ రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతూ వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. కోల్‌కతా, ఆర్సీబీలపై రెచ్చిపోయిన




ఈ లెగ్ స్పిన్నర్.. బుధవారం చెన్నై సూపర్ కింగ్స్‌పై హ్యాట్రిక్‌తో మెరిశాడు. 200ల స్కోర్‌కుపైగా కొట్టేలా కనిపించిన సీఎస్కేను 191కే కట్టడి చేయడంలో యుజీ సఫలం అయ్యాడు. అనంతరం తనదైన 'సిగ్నేచర్ స్టయిల్' సెలబ్రేషన్‌తో ఫ్యాన్స్‌ను అలరించాడుదాంతో, చాహల్ నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ ఆర్జే మహవేశ్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ పోస్ట్ పెట్టింది. అందులో 'గాడ్ మోడ్ ఆన్ క్యా.. ఒక యోధుడి బలం ఇది' అంటూ రాసుకొచ్చిందీ బ్యూటీ. దాంతో.. మరోసారి వీళ్ల మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి.ఐపీఎల్ 18వ సీజన్‌కు ముందే భార్య ధనశ్రీ వర్మ కు విడాకులు ఇచ్చేసిన చాహల్ స్నేహితురాలైన మహవేశ్‌తో సన్నిహితంగా ఉంటున్నాడు. వీళ్లిద్దరూ టీమిండియా మ్యాచుల్లో జంట పక్షుల్ల స్టేడియాల్లో కనిపించి సందడి చేశారు. ఆ తర్వాత ఐపీఎల్ మొదలైనప్పటి నుంచి మహవేశ్ తన ఫ్రెండ్ అయిన చాహల్‌కు మద్దతుగా ఉంటూ వస్తోంది. అతడు మైదానంలో అద్భుత ప్రదర్శన చేసిన ప్రతిసారి ఇన్‌స్టా పోస్ట్‌లతో వార్తల్లో నిలుస్తోంది. ఇప్పటివరకూ 18వ ఎడిషన్‌లో ఆడిన 10 మ్యాచుల్లో చాహల్ 9.43 ఎకానమీతో 13 వికెట్లు పడగొట్టాడు. అతడి అత్యుత్తమ ప్రదర్శన 4-28.

# చేతులెత్తేసిన రాజస్థాన్ బ్యాటర్లు.. డబుల్ హ్యాట్రిక్ కొట్టిన ముంబై

ఐపీఎల్ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ కు ఎదురన్నదే లేకుండా పోయింది. బ్యాటుతో బాదేస్తూ.. బంతితో బెంబేలెత్తిస్తున్న ముంబై వరుసగా ఆరో విజయం సాధించింది. బౌల్ట్(3-28), కరన్ శర్మ(3-28)ల విజృంభణతో 100 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను చిత్తు చేసింది. మొదటగా ఓపెనర్లు రియాన్ రికెల్టన్(61), రోహిత్ శర్మ(53)లు అర్ధ శతకాలతో రెచ్చిపోగా.. సూర్యకుమార్ యాదవ్(48 నాటౌట్), హార్దిక్ పాండ్యా(48 నాటౌట్)లు విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించారు. అనంతరం బౌల్ట్, బుమ్రాల ధాటికి రాజస్థాన్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. 47 పరుగులకే రాజస్థాన్ సగం వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టును కరన్ శర్మ ఆలౌట్ అంచున నిలిపాడు. ఆఖర్లో జోఫ్రా ఆర్చర్ పోరాటంతో స్కోర్ వంద దాటించాడు. అతడిని ఔట్ చేయడంతో ముంబై డగౌట్‌లో సంబురాలు మొదలయ్యాయి.ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ 18వ సీజన్‌లో జైత్రయాత్ర కొనసాగిస్తోంది. వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన పాండ్యా సేన ఆరో గెలుపుతో 14 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఆల్‌రౌండ్ షోతో



అదరగొట్టిన ముంబై.. రాజస్థాన్‌ను 100 పరుగుల తేడాతో ఓడించింది. భారీ ఛేదనలో రాజస్థాన్ రాయల్స్‌కు తొలి ఓవర్ నుంచే షాక్‌లు తగిలాయి. గుజరాత్ టైటాన్స్‌పై రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ(0) డకౌటయ్యాడు. దీపక్ చాహర్ బౌలింగ్‌లో వైభవ్ టైమింగ్ మిస్ అవ్వగా విల్ జాక్స్ గాల్లోకి లేచిన బంతిని క్యాచ్ అందుకున్నాడు.బౌల్ట్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది ఆత్మవిశ్వాసంతో కనిపించిన యశస్వీ జైస్వాల్(13).. అదే ఓవర్లో పెద్ద షాట్ ఆడబోయి బౌల్డ్ అయ్యాడు. దాంతో, 18 పరుగులకే రాజస్థాన్ రెండు కీలక వికెట్లు కోల్పోయింది. బౌల్ట్ బౌలింగ్‌లో నితీశ్ ఔట్ కాగా.. కాసేపటికే పరాగ్‌ను బుమ్రా బోల్తా కొట్టించాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే హెట్‌మైర్(0) తొలి బంతికే సూర్యకు సులువైన క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్ శుభం దూబే(15) రెండు సిక్సర్లతో అలరించినా పాండ్యా బౌలింగ్‌లో బౌండరీ లైన్ వద్ద బౌల్ట్ చేతికి చిక్కాడు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్(11)ల్‌ను ఔట్ చేసిన కరన్ శర్మ రాజస్థాన్ ఓటమిని ఖరారు చేశాడు. అయితే.. జోఫ్రా ఆర్చర్(30) కాసేపు పోరాడాడు. దాంతో, రాజస్థాన్ 100 పరుగులు చేయగలిగింది. స్ట్రాటజిక్ బ్రేక్ తర్వాత బౌల్ట్ బౌలింగ్‌లో బుమ్రా క్యాచ్ పట్టడంతో ఆర్చర్ ఔటయ్యాడు. ముంబై 100 రన్స్ తేడాతో గెలుపొందింది. ఇప్పటివరకూ ప్రత్యర్థికి 200 ప్లస్ లక్ష్యాన్నినిర్దేశించిన ప్రతిసారి ముంబై జయకేతనం

## స్పోర్ట్స్

# వందలకొద్దీ పరుగులు కాదు బ్రదర్..

### ట్రోఫీ గెలవడమే ముఖ్యం..!




ఐపీఎల్ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ సంచలన ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. రెండు వారాల క్రితం 8వ స్థానంలో ఉన్న ముంబై.. వరుసగా ఐదు విజయాలతో టాప్ -4లో చోటు సంపాదించింది. గతంలో ఐదుసార్లు ట్రోఫీని ఒడిసిపట్టిన ముంబై జట్టు ఈ దఫా కూడా ఛాంపియన్‌గా నిలిచే అవకాశాల్ని కొట్టిపారేయలేం. ఈ నేపథ్యంలోనే రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐసీఎల్‌లో ట్రోఫీ గెలవకుండా వందల కొద్దీ పరుగులు సాధించడం వల్ల ప్రయోజయం ఉండదని హిట్‌మ్యాన్ అన్నాడు.ఐపీఎల్‌లో అందరూ ఒక బ్యాటర్ ఎన్ని పరుగులు సాధించాడు అనేదే చూస్తారు. రికార్డులు బద్ధలు కొట్టే ఆటగాళ్లను పొగడ్తల్లో ముంచెత్తుతారు. అయితే.. ఇవన్నీ తనకు ఏమాత్రం నచ్చవు అంటున్నాడు ముంబై మాజీ సారథి రోహిత్. 'నా దృష్టిలో 600 నుంచి 700లకు పైగా రన్స్ చేయడం గొప్ప కాదు. ట్రోఫీ గెలవడం ప్రధానం. ఇన్నేసి పరుగులు చేసినా ఛాంపియన్ అనిపించుకోకుంటే అవన్నీ బూడిదలో పోసిన పన్నీరేగా' అని హిట్‌మ్యాన్ వెల్లడించాడు. అంతేకాదు మిగతా బ్యాటర్ల మాదిరిగా తన లక్ష్యం పరుగులు చేయడం కాదని చెప్పేశాడీ డాషింగ్ బ్యాటర్.'ఒక సీజన్‌లో ఇన్ని రన్స్ చేయాలి అని టార్గెట్ పెట్టుకోను. నిజం చెప్పాలంటే అలాంటివి నాకు ఏమాత్రం ఇష్టముండవు. నాకు మ్యాచ్‌లు గెలవడమే ముఖ్యం. మైదానంలోకి దిగిన ప్రతిసారి అత్యుత్తమ ప్రదర్శన చేస్తున్నా. 2019 వన్డే వరల్డ్ కప్ సమయంలోనే నేను సెంచరీలతో చెలరేగాను. కానీ, అనూహ్యంగా సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయాం. అప్పుడే నాకు రన్స్ ముఖ్యం కాదు మ్యాచ్‌లు గెలవడం ప్రధానమని అర్థమైంది' అని రోహిత్ వివరించాడు. ఫుల్‌షాట్లకు కేరాఫ్ అయిన రోహిత్ ఏప్రిల్ 30న 38వ వసంతంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసింది.



# అల్లు అర్జున్‌కు జోడీగా అనన్య ?

అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. అల్లు అర్జున్ పుట్టినరోజున ప్రకటించిన ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'ఏఏ 22.. అట్లీ 6'. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటించనున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్‌ను ఫైనల్ చేసినట్లు సమాచారం. మరో కథానాయికగా 'లైగర్' ఫేమ్ అనన్యా పాండేను ఎంపిక చేసినట్లు టాక్. ఈ సినిమాలో నటించడానికి మేకర్స్ అనన్యను సంప్రదించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.



# శృతి హాసన్ పోస్ట్ చూసి కంగారు పడుతున్న ఫ్యాన్స్..

## ఏంటి ఆ వ్యాధితో బాధపడుతుందా?

కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ తెలుగులో గబ్బర్ సింగ్ చిత్రంతో మంచి హిట్ కొట్టి ఆ తర్వాత వరుస అవకాశాలని అందిపుచ్చుకుంది. ప్రస్తుతం టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా ఉన్న శృతి సింగర్‌గా.. మ్యూజిక్ డైరెక్టర్‌గా.. హీరోయిన్‌గా కూడా సత్తా చాటుతోంది. సినిమాల్లో సక్సెస్ బాగానే ఉన్నా.. నిజ జీవితంలో రిలేషన్‌ల విషయంలో మాత్రం బొక్క బోర్లా పడింది. ఇప్పటి వరకు ముగ్గురితో ప్రేమాయణం నడిపింది. ఆ మూడు లవ్ స్టోరీలు ఫెయిల్యూర్ అయ్యాయి. సినిమాల కన్నా కూడా శృతి హాసన్ ఈ మూడు రిలేషన్స్‌తోనే ట్రెండింగ్‌లో నిలిచింది.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన శృతి హాసన్.. నేను నా రిలేషన్స్‌లో చాలా నిజాయితీగా ఉన్నాను. ఆ రిలేషన్స్ ఫెయిల్ అయినపుడు నా లవర్స్‌ను తప్పుబట్టడం లేదు కాని నా బ్రేకప్స్ నుంచి చాలా నేర్చుకున్నాను. అవి నా ఎదుగుదలకు ఉపయోగపడతాయి అంటూ ఉపోద్ఘాతం చెప్పుకొచ్చింది. అదే ఇంటర్వ్యూలో తల్లిదండ్రుల విడాకుల గురించి కూడా మాట్లాడింది. మా అమ్మానాన్న విడిపోయిన తర్వాత నా జీవితం తల్లకిందులు అయిపోయింది. చెన్నై నుంచి ముంబై వెళ్లి అక్కడ ఎన్నో బాధలు పడ్డాము. మెర్సెండెస్ బెంజ్ కారులో తిరిగే మాకు లోకల్ ట్రైన్‌లో తిరిగే పరిస్థితి వచ్చింది' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది శృతి హాసన్. ఇక శృతి హాసన్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ తనకు సంబంధించిన పలు విషయాలు షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా తన ఇన్‌స్టాలో చేసిన పోస్ట్ చూసి అభిమానులు కంగారు పడుతున్నారు. శృతి ఏదో ప్రమాదకరమైన వ్యాధితో బాధపడుతున్నట్టు పేర్కొంది. కాని తనకు వచ్చిన వ్యాధి ఏంటో మాత్రం రివీల్ చేయలేదు. శృతి పెట్టిన పోస్ట్ మాత్రం అభిమానులని తెగ కంగారు పెట్టేస్తుంది. ఆమె అనారోగ్యంతో బాధపడుతుంటే త్వరగా కోలుకోవాలి అని ప్రార్థిస్తున్నారు. కాగా, శృతి హాసన్ ఈ మధ్య సలార్ అనే చిత్రంతో పెద్ద హిట్ కొట్టిన విషయం విదితమే.

# ఆ విషయంలో రిస్క్ తీసుకోవడం చాలా అవసరం..

## -సమంత ఆసక్తికర వ్యాఖ్యలు..



టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్ సమంత ఇప్పుడు నిర్మాతగానూ రాణిస్తున్న సంగతి తెలిసిందే. కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న సామ్.. ఇప్పుడు రీఎంట్రీ ఇస్తుంది. ప్రస్తుతం సామ్ నిర్మించిన చిత్రం శుభం. ఇటీవల విడుదలైన ఈ మూవీ టీజర్ ఆకట్టుకుంది. మరోవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులకు అందుబాటులో ఉంటుంది. కొన్ని రోజులుగా ఆరోగ్య విషయాలు.. వ్యాయామ వీడియోస్ షేర్ చేస్తుంది సామ్. రెండేళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న నటి సమంత, చికిత్స తర్వాత ఇప్పుడు తిరిగి నటనను ప్రారంభించింది. ప్రస్తుతం సినిమాల్లో నటించడమే కాకుండా నిర్మాతగా కూడా రంగంలోకి అడుగుపెట్టింది. ఆమె తెరకెక్కించిన శుభం చిత్రం మే 9న రిలీజ్ కానుంది.సమంత ఈ చిత్రాన్ని నిర్మించడమే కాకుండా, ఇందులో ఒక ప్రత్యేక పాత్రను కూడా పోషిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సామ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "రిస్క్ తీసుకోకుండా సినిమాలో అర్థవంతమైన మార్పును ఆశించలేము. నేను ఎప్పుడూ రిస్క్ తీసుకోవడం నుండి వెనక్కి తగ్గలేదని నేను అనుకుంటున్నాను. చాలావరకు నష్టాలు చూశాన



# హిట్ 3 సక్సెస్ సెలబ్రేషన్స్..

## - దర్శకుడిని రంగులతో ముంచెత్తాడుగా..!

నాని హీరోగా శైలేష్ కొలను తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ హిట్ 3 చిత్రం కాగా, ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయం సాధించింది. నాని మరోసారి తన పర్‌ఫార్మెన్స్‌తో అదరగొట్టాడు. ఓ వైపు సీరియస్ ట్రాక్ నడుస్తున్నపుడే.. మధ్య మధ్యలో నాని, శ్రీనిధి మధ్య సీన్స్ ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకున్నాయి. సెకండాఫ్ అంతా ట్విస్టులు, టర్నులతో అదిరిపోయింది.ముఖ్యంగా చివరి 40 నిమిషాలు అయితే నెక్స్ట్ లెవల్ అని చెప్పాలి. హిట్ 1, 2 కేసులతో ఈ సినిమాను ముడిపెట్టిన విధానం ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంది.ప్రథమార్ధం అంతా స్క్రీన్‌ప్లే బేస్డ్‌గా సినిమా సాగగా, సెకండాఫ్ మొత్తం సినిమా స్ట్రయిట్ నేరేషన్. ఓ విధంగా 80లో చిరంజీవి నటించిన 'కిరాతకుడు' సినిమాను గుర్తు చేస్తుంది. మాస్ ప్రేక్షకులకు నిజంగా ఇది విజువల్ ఫీస్టే. అసలు అర్జున్ సర్కార్ కేరక్టర్ ఇంట్రో నుంచే ఆ పాత్రపై ఆసక్తిని రేకెత్తించాడు దర్శకుడు శైలేష్ కొలను. శైలేష్ 'హిట్' మూడో భాగాన్ని జనం మెచ్చేలా తీసిన కూడా హింసపాళ్లు కూసింత ఎక్కువైంది అని చెప్పాలి. చివర్లో అడవి శేషు సడన్ ఎంట్రీ, 'హిట్ 4' అంటూ కార్తీ ఎంటర్ అవ్వగానే.. థియేటర్ దద్దరిల్లిపోయింది. అయితే హిట్ ఫ్రాంచైజీలో వచ్చిన మూడు చిత్రాలు సూపర్ హిట్ అవ్వడం విశేషం. ఇక హిట్ 3 సినిమా సక్సెస్ టాక్ తెచ్చుకోవడంతో మూవీ యూనిట్ సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంది. ఈ సంతోషంతో నాని డైరెక్టర్ శైలేష్ కొలనుకు రంగులు పూశాడు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఆనందం వ్యక్తం చేశారు. నాని అయితే ఫుల్ ఖుష్‌లో ఉన్నాడు. మరోవైపు శైలేష్ చివరిగా తీసిన సైంధవ్ ఫ్లాప్ కావడంతో డీలా పడ్డ దర్శకుడు ఇప్పుడు హిట్ తో మరింత జోష్‌లో ఉన్నట్టు కనిపిస్తుంది. త్వరలో నాగార్జునతో ఓ మూవీ ప్లాన్ చేసినట్టు తెలుస్తుంది. మరోవైపు నాని ప్రస్తుతం ది ప్యారడైజ్ అనే చిత్రంతో బిజీగా ఉన్నాడు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492